

ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 39.0
కనిష్ఠం : 24.0

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6:26 (మంగళ)
సహరీ : 4:35 (బుధ)

5న చంద్రబాబు రాక

» తణుకు, పాలకొల్లులో ప్రజాగళం సభలు



భీమవరం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు ప్రజా గళం యాత్రలో భాగంగా ఈ నెల 5న తణుకు, పాలకొల్లులో పర్యటి స్తారు. కూటమి అభ్యర్థులు ఖరారైన తర్వాత ఆయన జిల్లాకు తొలిసారిగా వస్తున్నారు. అదే రోజు రాత్రి జిల్లాలో బస చేసి, మర్నాడు ముఖ్య నేతలు, అభ్యర్థులతో సమీక్షిస్తారు. ఈ యాత్రను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షురాలు తోట సీతారమలక్ష్మి పిలుపునిచ్చారు.

పోస్టల్ బ్యాలెట్ జారీపై ప్రత్యేక శ్రద్ధ

» కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్

ఏలూరు సిటీ, ఏప్రిల్ 1 : పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియకు సంబంధించి రానున్న రెండు రోజులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో సోమవారం పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్ అంశాలపై ఆయన సమీ క్షించారు. ఆయన మాట్లాడుతూ సుమారు 25 వేల పోస్టల్ బ్యాలెట్లు అవసరం కాగలవన్నారు. ఇందుకు సం బంధించి నియోజకవర్గాల వారీగా నివేదికను రూపొం దించాలన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి 11 వేల సిబ్బంది, ఐదు వేల మంది అత్యవసర సేవలకు సంబంధించిన సిబ్బంది, 1800 పోలీసులతో పాటు మిగి లిన 85 ఏళ్లు నిండిన విభిన్న ప్రతిభా వంతులు తది తరులు ఉన్నారన్నారు. హోం ఓటింగ్ వినియోగించు కోవాల్సిన వారు ఫారం-12 డీ అందజేయాలన్నారు. దీనికి సంబంధించి బీఎల్‌వోలు ఆయా సెక్టార్ అధికారులు ఈ విషయంపై పర్యవేక్షించాలన్నారు. పోలింగ్ సిబ్బంది శిక్షణపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. జేసీ లావణ్యవేణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సీఈవో వీడియో కాన్ఫరెన్స్

పోస్టల్ బ్యాలెట్ అండ్ హోం ఓటింగ్ కు సంబంధించి అధికారుల బాధ్యతలు, వారు నిర్వహించాల్సిన విధులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ రాష్ట్ర సచివాలయం నుంచి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులకు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా వివరించారు. ఏలూరు కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్, జేసీ లావణ్యవేణి, ఐటీడీఏ పీవో ఎం. సూర్యతేజ, డీఆర్వో పుష్పమణి తది తరులు పాల్గొన్నారు. పోస్టల్ బ్యాలెట్ అండ్ హోం ఓటిం గ్ కు సంబంధించి ఏప్రిల్ , మే మాసాల్లో తేదీల వారీగా నిర్వహించాల్సిన కార్యక్రమాలను ఎన్నికల విధులు నిర్వ హించే ఉద్యోగులు , పోలీసులు, ఇతర సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాలు కల్పన, అందుకు అవసరమైన ఫెసిలి టేషన్ సెంటర్ల ఏర్పాటు తదితర అంశాలను వివరించా రు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ , హోం ఓటింగ్ ప్రక్రియను వివరించారు.



పెన్షన్ రాజకీయం

ఎన్నికలు వచ్చాయంటే చాలు వైసీపీ వివిధ మార్గాల్లో జనం మీద వల విసురుతూనే ఉంటుంది. ఏ చిన్న అవకాశం వచ్చినా అసలు వదులుకోలేదు. నయానో, భయానో తమ పార్టీ ఒక్కటే లబ్ధి పొందేలా వ్యూహం పన్ని మరీ వైరి వర్గాలను దెబ్బతీస్తోంది. ఈసారి వలంటీర్లు, పింఛన్ల విషయంలో అదే తరహా రాద్ధాంతం చేసింది. ప్రభుత్వంలో ఉన్నది వైసీపీయే అన్న విషయం మరిచి ప్రతిపక్షాల మీద ఎదురుదాడికి దిగుతోందన్న సామన్యుడి వాదనకు ఊత మిచ్చేలా ప్రవరిస్తోందనే విమర్శలు ఉన్నాయి. ఒకటో తేదీన పింఛన్ అందకపోవడానికి అధికారిక కారణాలు ఏమైనా ఈ నెపాన్ని తెలుగుదేశంపై మోపే ప్రయత్నాలు చేశారు. ఇందుకు తగ్గట్లుగానే టీడీపీ చాలాచోట్ల ఈ దుష్ప్రచారాన్ని నిలదీసింది.

– ఏలూరు ఆంధ్రజ్యోతి, ప్రతినిధి

ఎన్నో కుయుక్తులు..

గడిచిన మూడు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా ఒకటో తేదీన పింఛన్లు అందించడం కష్టమేననే విషయం బహిరంగ విషయమైనా వలంటీర్లు తోడుగా అధికారపక్ష నేతలు ఈ వ్యవహారం మొత్తాన్ని రంగు మార్చి మరీ విపక్షాలపై బురద పూశారు. జిల్లావ్యాప్తంగా దాదాపు 2 లక్షల 74 వేల మంది పింఛన్‌దారులు ఉండగా, వీరికి నెలకు రూ.81 కోట్లను చెల్లిస్తున్నారు. పింఛన్ తీసుకునే ప్రతి లబ్ధిదారుడికి అందుబాటులోకి పింఛన్ వచ్చే బాధ్యత వలంటీర్‌దే. ఎన్నికల ముందుకొచ్చేసరికి ఈ వ్యవహారం కాస్త దారి మళ్లించేందుకు అనేక ప్రయత్నాలు జరుగుతున్నట్టు విమర్శలు లేకపోలేదు. ఇంటింటికీ వెళ్లి చేతికి అందించే పింఛన్ కేవలం కొందరు ఫిర్యాదు కారణంగానే ఆగిపోయిందని, ఇది మరో రెండునెలల పాటు ఉన్నా ఆ తర్వాత వైసీపీ సర్కార్ మళ్ళీ అధికారంలోకి వస్తే యథావిధిగా పింఛన్ అందించడం సాధ్యమవుతుందని సంకేతం ఇచ్చేలా గడిచిన 48 గంటలుగా ప్రచారం చేస్తున్నారు. అవ్వా తాతలతో పాటు దివ్యాంగులు, వితంతువులతో పాటు అందరి దృష్టిని మళ్లించేందుకు విఫలయత్నం చేశారు. వాస్తవానికి పింఛన్ అందించడానికి రాష్ట్రసర్కార్ ఖజానాలో ఏ మాత్రం అవకాశం లేని విషయాన్ని పక్కదారి పట్టించే ప్రయత్నాలు అన్నిచోట్ల సాగాయి. ఎన్నికల సంఘం కంట పడకుండానే పరోక్షంగా పింఛన్‌దారుల మనస్సుల్లో తామే గొప్ప అన్నట్టు మిగతా పక్షాలు అన్ని పింఛన్‌దారులకు వ్యతిరేకం అన్నట్టు వైసీపీ గెలం విసురుతోంది. వలంటీర్లు వారి సంబంధీకులు సైతం కొన్నిచోట్ల ఒకటో తేదీ పింఛన్ రాకపోవడానికి తెలుగుదేశమే కారణం అన్నట్టు పరోక్షంగా కొందరి చెవిన వేసే ప్రయత్నం సాగింది. వలంటీర్లను కేవలం పింఛన్ అందించడానికి మాత్రమే ఎన్నికల సంఘం దూరం గా ఉంచింది. అయితే దీనికి భిన్నంగా వీరిని పక్కన పెట్టడా నికి తెలుగుదేశం కూటమి కారణమంటూ ఆనోట ఈనోట ప్రచారం ముమ్మరం చేశారు. వాస్తవానికి వలంటీర్ వ్యవస్థ కొనసాగు తుందని, తెలుగుదేశం అధినేత చంద్ర బాబు ఇప్పటికే ప్రకటించినా దీనికి భిన్నంగా ఎన్నికల సంఘం ఆదేశాలకు విరుద్ధంగా పింఛన్ విషయాన్ని రచ్చ చేసేందుకు అధికార పార్టీ నాయకులు శాయశక్తుల కృషి చేస్తున్నారు.

ఎన్నికల ప్రచారంలో వలంటీర్లు

మొగల్తూరు, ఏప్రిల్ 1 : ముత్యాలపల్లిలో సోమవారం వైసీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే ముదు నూరి ప్రసాదరాజు నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో గ్రామానికి చెందిన ఆరు గురు వలంటీర్లు రేవు రాము, సార్వ దుర్గాప్రసాద్, వాటాల కామాక్షి, కొల్లాటి మణికంఠ, విష్ణుకుమారి, లక్ష్మీ కుమారి పాల్గొన్నారు. దీనిపై గ్రామ జనసేన నాయకులు సోషల్ మీడి యాలో పోస్టు చేశారు.

దీటుగా నిలబడిన టీడీపీ

ఎక్కడికక్కడ తమ పార్టీపై బురదచల్లే ప్రయత్నాలను తెలుగుదేశం శ్రేణులు నిలువరించేందుకు శతవిధాలా ప్రయత్నించాయి. 'టీడీపీ నాయకులు ఎలక్షన్ కమిషన్‌కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మన ద్వారా ఇంటింటికీ పెన్షన్ డిస్ట్రిబ్యూషన్ కార్యక్రమాన్ని నిలిపివేశారు. అవ్వా తాతలకు బాధ్యతగా ఇచ్చే పెన్షన్ కార్యక్రమాన్ని ఆపింది. ఇదంతా టీడీపీ పనేనని గడపగడపకు వెళ్లి చెప్పండి, రెండు నెలల్లో జగనన్న ప్రభుత్వంలో మళ్ళీ ప్రతినెల ఘనంగా నిర్వహిస్తామని కూడా చెప్పాలి.' వలంటీర్ ఒకరు వాట్సప్‌లో ఇచ్చిన సందేశమిది. దీనిపై తెలుగుదేశం స్పందించింది. తక్షణ చర్యలు తీసుకోవాల్సిందిగా దెందులూరు ఆర్వో, జాయింట్ కలెక్టర్ లావణ్యవేణికి సోమవారం ఫిర్యాదు చేశారు. టీడీపీ ముఖ్యనేతలంతా పార్టీపై జల్లుతున్న పింఛన్ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టారు. మార్చి నెలాఖరు ముందు వేలకు వేలు తీసుకెళ్లి కాంట్రాక్టర్ల జేబులో పోశారు.



అవ్వా తాతలే కవచం!

» టీడీపీ టార్గెట్‌గా వైసీపీ భారీ దుష్ప్రచారం
» ఖజానా వట్టిపోయినా నోరెత్తకుండా ఆ పై ఎదురు పార్టీలపై నెపాలు
» చాలాచోట్ల వలంటీర్లు, బంధువులు వత్తాసు
» ఎన్నికల కమిషన్ ఆదేశాలను మార్చేశారు
» పింఛన్‌లు ఇవ్వాలని టీడీపీ డిమాండ్

ఖజానా మొత్తం ఖాళీ అయింది. అప్పటికి పేదలు గుర్తు రాలేదు. దీన్ని కప్పిపుచ్చు కోవడానికి వలంటీర్ వ్యవస్థను వాడుకునే ప్రయత్నం జరుగుతోంది. అసలు పింఛన్ అందకపోవడానికి టీడీపీనే కారణమన్న బోగస్ ప్రచారానికి దిగుతోంది. ఎట్టి పరిస్థితుల్లోనూ దీన్ని అడ్డుకోవాల్సిందేనని ప్రజలందరికి టీడీపీ తన ప్రచారంలో వివరిస్తోంది. పింఛన్లు ఇవ్వకపోవడానికి ప్రధాన కారణం ఒకవైపు ఖజానాలో డబ్బులేకపోవడం, ఇంకోవైపు పప్పుబెల్లాల్లా కాంట్రాక్టర్లకు పంచిపెట్టడం, ఇంకోవైపు కాంట్రాక్ట్, వలంటీర్‌లను వద్దన్నా వినకుండా పనులు చేయించి వారిపై కేసులు పెట్టేలా వైసీపీ సర్కార్ ప్రయత్నిస్తోందని ఏలూరులో టీడీపీ అభ్యర్థి బడేటి చంటి ప్రజా సమక్షంలోనే వివరిస్తున్నారు. చేసిన తప్పులు చేస్తూనే ఉన్నారు. కావాలనే దుష్ప్రచారానికి దిగుతున్నారు. ప్రజలు అమాయకులు కారు. వాస్తవాలను అతిదగ్గరగా చూస్తారు. రాష్ట్ర టీడీపీ అధికార ప్రతినిధి శ్యామ్‌సుందరశేష పేర్కొన్నారు. ఇలా ఒక్కొక్కరూ బహిరంగ వేదికలపై తమ పార్టీపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టారు. తాజా పరిస్థితులపై వలంటీర్లు రాజీనామాకు దిగుతున్నట్టు సోమవారం అంతా జిల్లాలో విస్తృత ప్రచారాలు చేశారు. రాజీనామాలకు సిద్ధపడిన వలంటీర్లు ఎవరూ సోమవారం పొద్దు పోయే వరకు లెక్క తేలనే లేదు. పేద ప్రజలు అందరికి సకాలంలో పింఛన్లు ఇచ్చి తీరాల్సిందేనని తెలుగుదేశంపార్టీ డిమాండ్ చేస్తోంది.

పింఛన్ల పంపిణీ నిబంధనలు

- ఎన్నికల కోడ్ పూర్తయ్యే వరకు వలంటీర్ల ద్వారా ఇంటింటా పింఛన్ పంపిణీ ఉండదు.
- ఈ నెల మూడో తేదీ నుంచి సచివాలయం వద్ద మాత్రమే సెక్రటేరియట్ సిబ్బంది వీటిని అందజేస్తారు.
- పింఛన్‌దారులు పెన్షన్‌కు వచ్చేటప్పుడు ఆధార్ కార్డు లేక ఇతర గుర్తింపు కార్డు మాత్రమే తీసుకురావాలి.
- పింఛన్ పాస్ పుస్తకంలో సీఎం జగన్ ఫొటో వున్నందున అది తీసుకుని రాకూడదు. ఇది ఎన్నిక కోడ్‌కు విరుద్ధం.
- సచివాలయం వద్ద తొక్కిసలాట రాకుండా జాగ్రత్తలు తీ సుకోవాలి.
- వలంటీర్ల వద్ద ఉన్న మొబైల్, బయోమెట్రిక్ పరికరం జిల్లా ఎన్నికల అధికారికి అప్పగించాలి.
- పంచాయతీ సెక్రటరీలు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లకు ఆథ రైజేషన్ లెటర్ తమ లాగిన్‌లో జనరేట్ చేసి అందించాలి.
- బ్యాంకు నుంచి నగదు విత్ డ్రా చేసే వారు ఆథరైజేషన్ లెటర్ ఒరిజినల్ కాపీ దగ్గర ఉంచుకోవాలి.
- అనారోగ్యంతో మంచంపై ఉన్న వారికి సంబంధించి ఏ విధంగా పంపిణీ చేయాలనే విషయాన్ని తెలియచేస్తా మని అధికారులు చెప్పారు.
- సచివాలయ సిబ్బందికి లాగిన్స్ ఇవ్వనుండడంతో అందరికి అన్ని పేర్లు కనిపిస్తాయి. క్లస్టర్ మ్యాపింగ్ ఉండదు.

డ్వాక్రా రుణమాఫీ చేస్తామంటూ..

» ఆధార్ కార్డుల సేకరణలో డ్వాక్రా సీఏలు

అత్తిలి, ఏప్రిల్ 1 : డ్వాక్రా రుణమాఫీ కోసం మహిళల నుంచి వివరాలతోపాటు ఆధార్ కార్డులను సీఏలు సేకరిస్తు న్నారు. దీంతో మహిళలు కూడా వారికి సహకరించి వివ రాలు చెప్పడంతోపాటు ఆధార్ జిరాక్స్ కాపీలను అంద జేస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా అత్తిలి మండలంలోని గ్రామాల్లో ఇది జోరుగా జర గడంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఓ వైపు ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ ఇలా చేయ డంపై ప్రజల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. రుణమాఫీ కోసం అడుగుతున్నారు కాబట్టే ఇస్తున్నామని పలువురు మహిళలు ఆంధ్రజ్యోతికి తెలిపారు. రిజిస్ట్రేషన్ చేయించాలి కాబట్టే ఆధార్ కార్డులు సేకరిస్తున్నామని డ్వాక్రా సీఏలు చెబుతున్నారు.



మందు బాబుల.. జోరు!

» ఏలూరు నగరంలో.. రోడ్లపైనే సిట్టింగులు
» ఇబ్బందులు పడుతున్న నగర వాసులు
» ఎక్కడా కానరాని పోలీసులు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 1 : త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేప థ్యంలో ఇప్పటికే శాంతి భద్రతలను కాపాడేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టినా అవేమీ తమకు అడ్డంకి కాదంటూ మందుబాబులు యథేచ్ఛగా రోడ్లపై మద్యం తాగుతుండడంతో ఏలూరు నగరంలో మహిళలు, వాహన దారులు, బాటసారులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. నగరంలో ఏ మద్యం షాపు చూసినా ఆ సమీపంలో మందుబాబులు మోటారు సైకిళ్లను పార్కింగ్ చేసి అక్కడే మద్యం తాగుతూ ఇబ్బందులు కలిగిస్తున్నారు. తాగేసిన గ్లాసులను వెళ్లే వారిపై విసరడం, మహిళలను, యువతుల పట్ల అసభ్యంగా చూడడం, సైగలు చేయడం వంటి చేష్టలకు పాల్పడుతున్నారు. గతంలో నగరంలో పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగేవారిని కట్టడి చేశారు. అయితే ఇటీవల మళ్ళీ వీరి ఆగడాలు పెరిగాయి. పవర్ పేట గేటు సమీపంలో, ఫైర్‌స్టేషన్ సమీపంలోని ఒక స్కూలు వెనుక రోడ్డులో పట్టపగలే మద్యం తాగుతూ అటుగా వెళ్లే నగరవాసులకు, విద్యార్థులకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. కొత్త బస్టాండ్ ప్రాంతం, వట్లూరు, సత్రంపాడు, వన్‌టౌన్‌లోని వంగాయిగూడెం ప్రాంతం, తంగెళ్ళమూడి ప్రాంతాల్లో ఇదే విధంగా మద్యం బాబులు రోడ్లపైన మద్యం తాగుతూ వాహనదారులకు, బాటసారులకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. గతంలో బ్లూకోడ్స్ తోపాటు ప్రత్యేక పోలీసు బృందాలు తిరుగుతూ ఇలాంటి వారిని గుర్తించి పెట్టీ కేసులు నమోదు చేసేవారు. ప్రస్తుతం నగరంలో బహిరంగ మద్యం తాగేవారిపై ఏ చర్యలు తీసుకోకపోవడంతో రోజురోజుకూ వీరి ఆగడాలు పెచ్చుమీరుతున్నాయి. ఎన్నికల వేళ ప్రచారం జోరు రోజు రోజుకూ పెరుగుతుండడంతో ఆ కార్యక్రమంలో పాల్గొన్న వారికి ప్రచార నిర్వాహకులు నేరుగా మద్యం షాపుల వద్దకు తీసుకెళ్లి మద్యం ఇప్పిస్తున్నారు. దీంతో వారు రోడ్లపైన గుంపులు గుంపులుగా తాగేస్తూ ఇబ్బందులు కలిగిస్తు న్నారు. నగరంలోని పలు ఖాళీ ప్రదేశాలు సైతం మందు బాబులకు ఆవాసా లుగా మారాయి. ఉన్నతాధికారులు తక్షణం చర్యలు తీసుకుని బహిరంగ ప్రదే శాల్లో మద్యం తాగేవారిని కట్టడి చేయాలని నగరవాసులు కోరుతున్నారు.



• ఏలూరులో జయహో బీసీ

టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిని గెలిపించాలంటూ ఏలూరులో జయహో బీసీ సదస్సు, ప్రజాగళంలో అభ్యర్థి బడేటి చంటి, జనసేన ఏలూరు ఇన్‌చార్జ్ రెడ్డి అప్పలనాయుడు తదితరులు

మాట ఇచ్చి.. మడమ తిప్పి..!



» కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఆశలు ఆవిరి
» పాదయాత్ర సమయంలో జగన్ హామీలు
» తీరా అధికారంలోకి వచ్చాక పట్టించుకోని వైనం
» సీఎం తీరుపై ఉద్యోగుల మండిపాటు
» జిల్లాలో నష్టపోయిన 8 వేల మంది ఉద్యోగులు

ఏలూరు రూరల్, ఏప్రిల్ 1 : పాదయాత్ర సమయంలో హామీలు ఇచ్చి అధికారం లోకి వచ్చాక మర్చిపోయి మాట ఇచ్చి మడమ తిప్పిన సీఎం జగన్ తీరుపై కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమాన పనికి సమాన వేతనం, రెగ్యులరైజ్ చేయడం, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను కాంట్రాక్ట్‌లోకి తెస్తామని ఇచ్చిన హామీకి సీఎం జగన్ మంగళం పాడేశారు. జిల్లాలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న సుమారు 8వేల మందికి పైగా ఉద్యోగుల ఆశలపై నీళ్లు చల్లారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జగన్ ఇచ్చిన హామీలు అమలు కోసం ఐదేళ్లుగా నేతల చుట్టూ తిరిగినా ఫలితం కనిపించలేదని ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల్లో దాదాపు 60 శాతం మంది ఆరోగ్యశాఖలో పనిచేస్తుండగా మిగిలిన 30 శాతం మంది ఫారెస్ట్, ఎస్.ఎస్.ఏ, మండల విద్యాశాఖ, పశు సంవర్థక శాఖల్లో పనిచేస్తున్నారు.

హామీలకు మంగళం

సీఎం జగన్ ఇచ్చిన హామీని అమలు చేసి ఉంటే జిల్లాలో సుమారు 8 వేల మందికి పైగా ఉద్యోగులకు మేలు జరిగేది. ప్రస్తుతం కాంట్రాక్ట్ విధానంలో పని చేస్తున్న ఉద్యోగులకు రూ.18 వేల నుంచి రూ.38 వేలు వేతనం లభిస్తోంది. రెగ్యులరైజ్ చేసి ఉంటే రెగ్యులర్ ఉద్యోగులకు లభించే వేతనం దక్కేది. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రస్తుతం రూ.15 వేల నుంచి రూ.24 వేలు చెల్లిస్తున్నారు. కనీస వేతనం అమలైతే రూ.30 వేలు లభించేది. ఈ రెండు కేటగిరిల్లో ఉద్యోగ భద్రత ఉండేదని, హెచ్‌ఆర్‌సీ పాలసీ అమలయ్యేది.

కేంద్ర పథకం అంటూ దాటవేత

కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేస్తున్న ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామన్న హామీని అమలు చేయాలని ఉద్యోగులు కోరితే ప్రభుత్వ పెద్దలు భిన్నమైన వాదన తెరపైకి తీసుకొచ్చారని వారు పేర్కొంటున్నారు. ఎస్.ఎస్.ఏ, నేషనల్ హెల్త్ మిషన్ వంటి స్కీమ్‌లను కేంద్ర, రాష్ట్రాలు అమలు చేస్తున్నాయని, వీటిలో పనిచేసే వారిని రెగ్యులరైజ్ చేయలేమని ప్రభుత్వం స్పష్టం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారంలోకి వచ్చాకా మాట మార్చారని కేవలం వైద్య ఆరోగ్య శాఖ లో పని చేస్తున్న సుమా రు 300 మందిని మాత్రమే రెగ్యులర్ చేశా రని పేర్కొన్నారు.

అమలు ఊసేలేదు..

కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు మేలు చేస్తామని, మాట ఇచ్చి మడమ తిప్పారని ఇచ్చిన హామీ అమలు చేయకుండా నమ్మించి మోసం చేశారని, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘ నాయకులు పేర్కొంటు న్నారు. ఉద్యోగులకు భద్రత, బెనిఫిట్స్ అందిస్తామని ఇచ్చిన హామీని తుంగలో తొక్కారని కేంద్ర పరిధిలోని స్కీమ్ అంటూ అడ్డగోలు వాదనను చేయడం కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను అన్యాయం చేయడమేనన్నారు.

'పది' మూల్యాంకనం ప్రారంభం

» ఏలూరు సెయింట్ గ్జేవియర్ హైస్కూలులో క్యాంపు
» జిల్లాకు సుమారు రెండు లక్షల జవాబు పత్రాలు
» కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 1 : పదో తరగతి పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకన సోమవారం ఏలూరు సెయింట్ గ్జేవియర్ హైస్కూలులో ఏర్పాటు చేసిన క్యాంపులో ప్రారంభమైంది. పలు జిల్లాల నుంచి సుమారు రెండు లక్షల జవాబు పత్రాలు మూల్యాంకన నిమిత్తం జిల్లాకు అందాయి. వీటిలో ఆంగ్లమాధ్యమ స్క్రిప్టులే అధికం. కొత్తజిల్లాల ప్రాతిపదికన తొలిసారిగా జిల్లాల పునర్విభజన తర్వాత ఈ ఏడాది నుంచి నిర్వహిస్తుండడంతో మూల్యాంకన ప్రక్రియ నుంచి మినహాయింపులు కోరే సిబ్బంది సంఖ్య చాలా తక్కువగా ఉండడం విశేషం. మరోవైపు స్పాట్ విధులకు అనారోగ్యాలు, 59 ఏళ్ల కంటే వయస్సు పైబడిన టీచర్లను ముందుగానే విధుల నుంచి ముందుగానే తప్పించడం క్యాంపు సకాలంలో ప్రారంభం కావడానికి ఉపకరిం చింది. ఏటా మధ్యాహ్నం 3గంటల తర్వాతే ప్రారంభమయ్యే స్పాట్ క్యాంపు ఈ దఫా ఉదయం 11 గంటలకే మొదలు కావడంతో నిర్ణీత గడువులోగానే ఈనెల 8వ తేదీలోపు మూల్యాంకన ప్రక్రియ ముగియడం ఖాయమని భావి స్తున్నారు. మరోవైపు స్పాట్ విధులకు నియమితులైన బోధనా సిబ్బందికి సం బంధించి స్కూల్ అటెండెన్స్ యాప్‌లోనే మూల్యాంకన బాధ్యతలను ఎవరె వరికి కేటాయించిందీ వివరాలను అప్‌లోడ్ చేయడంతో సంబంధిత సిబ్బంది ఎవ్వరూ గైర్హాజరయ్యేందుకు గాని, ఆలస్యంగా రిపోర్టు చేసేందుకుగాని అవకా శం లేకుండా పోయింది. ఇంతకుముందు ఈ తరహా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకునే అవకాశం లేక పలువురు స్పాట్ విధులకు దుమ్మా కొట్ట డం లేదా క్యాంపునకు వచ్చినా రిపోర్టు చేయకుండా మినహాయింపుల కోసం ఉపాధ్యాయ సంఘాల నాయకులతో రికమండేషన్లు చేయించుకోవడం, సాయంత్రం వరకు వేచి ఉండడం తదితర కారణాల వల్ల తీవ్రజాప్యం జరిగేది. స్పాట్ క్యాంపును ప్రభుత్వ పరిశీలకుడు, ఏపీ రెసిడెన్షియల్ స్కూల్స్ సొసైటీ డైరెక్టర్ ఆర్.నరసింహారావు పరిశీలించారు. మూల్యాంకనకు రోజుకి 40 ఆన్సర్ స్క్రిప్టుల చొప్పున ఒక్కో అసిస్టెంట్ ఎగ్జామినర్‌కు ఇస్తామని, క్యాంపు ఆవరణలోకి ఇతరులెవ్వరూ ప్రవేశించకుండా పోలీసు భద్రతను కల్పించినట్టు డీఈవో అబ్రహం తెలిపారు. విద్యాశాఖ అందజేసిన గుర్తింపు కార్డుని ధరించినవారిని పరిశీలించిన తర్వాతే లోనికి అనుమతి స్తారన్నారు. రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు స్పాట్ క్యాంపు జరుగుతుం దని ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ శ్రీకాంత్ తెలిపారు.



పేర్లు నమోదు చేయించుకుంటున్న ఉపాధ్యాయులు

దూరవిద్య ప్రాక్టికల్స్‌కు 130 మంది గైర్హాజరు

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 1 : ఏపీ సార్వత్రిక విద్యాపీఠం దూరవిద్య ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ పరీ క్షల్లో భాగంగా సోమవారం జరిగిన ఫిజిక్స్ పరీక్షకు జిల్లాలో 107 మంది, కెమిస్ట్రీ పరీక్షకు 128 మంది, బయో లాజికల్ పరీక్షకు 79 మంది అభ్యాసకులు హాజరయ్యా రని డీఈవో అబ్రహం ఓ ప్రకటనలో తెలిపారు. మొత్తం 130 మంది గైర్హాజరయ్యారని, జిల్లాలో ఎక్కడా మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదన్నారు.

ధాన్యం సేకరణకు సన్నద్ధం : జేసీ లావణ్యవేణి

ఏలూరు సిటీ, ఏప్రిల్ 1 : రబీ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యం సేకరణకు అధికారులు సన్న ద్ధం కావాలని జేసీ లావణ్యవేణి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై జిల్లా ధాన్యం సేకరణ కమిటీ సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ.. '2023-24 రబీ సీజన్‌కు సంబంధించి 120 ఆర్‌బీకేలను ఏప్రిల్ 10వ తేదీ అనంతరం ధాన్యం సేకరణ కోసం సిద్ధం చేస్తున్నాం. జిల్లాలో రబీ సీజన్‌లో 79,960 ఎకరా ల్లో వరి పంట సాగవ్వగా 3.11 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అంచనా వేశాం. ధాన్యం సేకరణకు 77 లక్షల గోనె సంచులు అవసరమవుతాయి. ఏ-గ్రేడ్ ధాన్యానికి క్వింటా లుకు రూ.2,203, కామన్ రకం ధాన్యానికి రూ. 2,183 కనీస మద్దతు ధర ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో 67 కొనుగోలు సహాయ కేంద్రాలను, 120 ఆర్‌బీకేలకు అనుసంధానించాం' అని తెలిపారు. సమావేశంలో ఆర్డీవోలు, అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

తాగునీటి సమస్య తలెత్తకుండా పటిష్ఠ ప్రణాళిక : కలెక్టర్

ఏలూరు కలెక్టరేట్, ఏప్రిల్ 1 : జిల్లాలో ప్రస్తుత వేసవిలో తాగునీటికి ఎటువంటి సమస్య తలెత్తకుండా పటిష్ఠమైన ప్రణాళిక రూపొందించుకుని అమలు చేస్తున్నామని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్య దర్శి కేఎస్ జవహర్‌రెడ్డికి తెలిపారు. రాష్ట్ర సెక్రటరియేట్ నుంచి సోమవారం వేసవిలో తాగునీటి సరఫరా, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, విద్యుత్ సరఫరా, తదితర అంశాలపై వివిధ జిల్లాల కలెక్టర్లతో సీఎస్ వీడియో కాన్ఫ రెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లాలో చేపడుతున్న పనులను కలెక్టర్ వివరిస్తూ మంచినీటి చెరువులు, సమ్మర్ స్టోరేజి ట్యాంకులను పూర్తి స్థాయిలో నింపుతా మన్నారు. శివారు ప్రాంతాలకు కూడా తాగునీరు అందేలా చర్యలు తీసుకుం టున్నామన్నారు. మెట్ట ప్రాంతాల్లో బోర్ వెల్స్ పరిశీలించి మరమ్మతులు చేయిం చి వినియోగంలోకి తీసుకొచ్చామన్నారు. స్వచ్ఛంద సంస్థల సహకారంతో తాగునీటి చలివేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సూర్యతేజ, డీఆర్వో డి.పుష్పమణి, డీపీవో తూతిక విశ్వనాథ్ శ్రీనివాస్, జిల్లా పరిషత్ సీఈవో కె.సుబ్బారావు, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆర్.విజయరాజు, డ్వామా పీడీ రాము, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సత్యనారాయణ, నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బ పట్ల అప్రమత్తంగా ఉండండి..

జిల్లాలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున వడదెబ్బ తగలవచ్చని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వై.ప్రసన్న వెంకటేష్ సూచిం చారు. జిల్లాలోని కమిషనర్లకు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు చర వాణి ద్వారా ఆదేశాలు జారీ చేస్తూ ప్రజలకు, మూగజీవులకు తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. పంచాయతీ కార్యాలయాల్లో, పట్టణ కార్యాల యాల్లో ఫస్ట్‌ఎయిడ్ బాక్స్ ఉండాలన్నారు. ప్రజల సహాయార్థం కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేశామని, జిల్లా రెవెన్యూ అధికారి, జిల్లా గ్రామ పంచాయతీ అధికారిలను 9491041422, 9849903321 నెంబర్‌లలో సంప్రదించవచ్చన్నారు.



కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించిన యజమాని

మా ఆవుదూడ పుట్టిన రోజు.. భోజనాలకు రండి..

గొరగనమూడిలో పుంగనూరు గోవుకు బర్త్‌డే వేడుకలు

పాలకోడేరు, ఏప్రిల్ 1 : చిన్నపిల్లల పుట్టిన రోజు వేడుకలు ఎంత ఘనంగా నిర్వహిస్తామో అంతకు దీటుగానే ఓ గోవుకు మొదటి పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. అయినవాళ్లను పిలిచి విందు భోజనాలు పెట్టారు. ఈ విచిత్ర సంఘటన గొరగనమూడిలో సోమవారం చోటు చేసుకుంది. గొరగన మూడి గ్రామానికి చెందిన పంపన రామకృష్ణ ఓ గోవును పెంచుకుంటున్నాడు. ఆ గోవుకు చిన్న ఆవు దూడ ఏడాది క్రితం జన్మించింది. పుట్టిన సమయంలోనే ఆవు దూడకు బెల్లంతో తులాభారం నిర్వహించి భోజనాలు పెట్టారు. ఆ గోవుకు మొదటి సంవత్సరం పుట్టిన రోజు వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. మూడు రోజుల ముందు నుంచే గ్రామంలో అయినవారందరి ఇంటింటికీ వెళ్లి మా ఆవు దూడకు మొదటి పుట్టిన రోజు వేడుకలు నిర్వహిస్తున్నామని భోజనాలు కూడా ఏర్పాటు చేశామని కబుర్లు అందించారు. కేక్ కట్ చేసి దూడకు తినిపించారు. బాణసంచా కాల్చారు. వేడుకకు వచ్చిన సుమారు 200 మందికి భోజనాలు ఏర్పాటు చేశారు. గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామస్థులు కూడా పుట్టిన రోజు వేడుకలు గురించి చెప్పుకున్నారు. విస్సాకోడేరు సర్పంచ్ బొల్లా శ్రీనివాస్, గొరగనమూడి మాజీ సర్పంచ్ చెల్లబోయిన పాపారావు, ఎస్సీ, ఎస్టీ జిల్లా మానిటరింగ్ కమిటీ సభ్యుడు పొన్నమండ బాలకృష్ణ, రుద్రరాజు జానకిరామరాజు, బల్లా పరమేశ్వరరావు, ఆంజనేయరాజు, తదితరులు పాల్గొన్నారు.



వివరాలు తెలుపుతున్న ఏలూరు వన్‌టౌన్ సీఐ రాజశేఖర్

కిల్లర్.. డాక్టర్ !

- ఫిలిప్పైన్స్‌లో ఎంబీబీఎస్
- ఆన్‌లైన్ బెట్టింగ్‌లో అప్పులపాలు
- అప్పు ఇచ్చినవారికి మత్తు ఇంజెక్షన్లు
- ఒకరు మృతి.. ఇద్దరు ఆసుపత్రి పాలు
- అరెస్టు చేసిన పోలీసులు




భానుసుందర్

ఏలూరు క్రైం, ఏప్రిల్ 1: ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగులకు అలవాటుపడి అప్పులు చేసి తీర్చే మార్గం కానరాక అప్పు ఇచ్చిన వారిని అనారోగ్యం పాలు చేయడానికి మత్తు ఇంజక్షన్లు చేసి ఆపై ఆసుపత్రిలో చేర్పించి అప్పు మాఫీ చేసుకునేందుకు పథకం పన్నిన ఒక జూనియర్ డాక్టర్‌ను ఏలూరు వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం రాత్రి ఏలూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వన్‌టౌన్ సీఐ రాజశేఖర్ వివరాలు తెలిపారు. ఏలూరు చొదిమెళ్ళకు చెందిన కొవ్వూరి భానుసుందర్ ఫిలిఫైన్స్‌లో ఎంబీబీఎస్ చేస్తున్నప్పుడు ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగులకు పాల్పడ్డాడు. పెద్ద మొత్తంలో అప్పులు చేసి బెట్టింగులు వేశాడు.గతేడాది మే నెలలో ఇండియాకు వచ్చిన తరువాత మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అర్హత పరీక్ష రాయాల్సి ఉంది. క్లినికల్ అసిస్టెంట్ వైద్యునిగా ఏలూరులోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేరాడు. ఏలూరు వన్‌టౌన్‌లోని వేణుగోపాలస్వామి గుడి ప్రాంతానికి చెందిన వాకచర్ల హిమతేజ వద్ద మూడు లక్షలు అప్పు తీసుకున్నాడు. ఆ సొమ్ము ఇవ్వాలని హిమతేజ అడుగుతున్నాడు. దీంతో హిమతేజ వద్దకు వెళ్లి తాను వైఎస్ఆర్ క్లినిక్‌లో పని చేస్తున్నానని రక్తనమూనాలు సేకరిస్తున్నానని, ఏదైనా అనారోగ్యం ఉంటే ప్రభుత్వమే పూర్తిగా ఉచితంగా వైద్య సేవలు అందిస్తుందని నమ్మబలికి ప్రణాళిక ప్రకారం ముందుగా తనతోపాటు గవర్నమెంట్ మార్ఫిన్ ఇంజక్షన్ (మత్తు ఇంజక్షన్) ఎక్కించాడు. హిమతేజ తీవ్ర అస్వస్థతతకు గురయ్యాడు. అతడిని ఆసుపత్రిలో చేర్పించి ఆసుపత్రి బిల్లు కట్టాలని ఎదురు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ఉద్దేశ్యపూర్వకంగానే తనకు ఇంజక్షన్ చేసి మోసగించాడని హిమతేజ ఏలూరు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ ఏడాది కేసు నమోదు చేశారు. అతని కోసం గాలిస్తుండగా పరారయ్యాడు. సత్రంపాడుకు చెందిన రాయల్ వెంకట్‌కు కూడా ఇలాగే ఇంజక్షన్ చేశాడు. అతను కూడా అనారోగ్యం పాలయ్యాడు. చొదిమెళ్ళ పోస్టుమాస్టర్ బత్తిన మల్లేశ్వరరావు అలియాస్ తంబి 63) అనే ఆయన వద్ద 15 లక్షలు పైగా అప్పులు తీసుకున్నాడు. ఆయన ఇంటికి తరచుగా వెళ్ళి వైద్యం అందించేవాడు. చివరకు అతన్ని హతమారిస్తే 15 లక్షలు కట్టాల్సిన అవసరం లేదని గతేడాది డిసెంబరు 24న మల్లేశ్వరరావుకు మార్ఫిన్ ఇంజక్షన్ అధిక మోతాదులో ఇచ్చాడు. అతని ఇంట్లో ఉన్న బంగారు బ్రాసిలేట్, బంగారు చైన్, లక్షన్నర నగదు అపహరించుకుపోయాడు. అప్పటి నుంచి పరారీలో ఉన్నాడు. జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు ఏలూరు డీఎస్పీ శ్రీనివాసులు పర్యవేక్షణలో ఏలూరు వన్‌టౌన్ సీఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో వన్‌టౌన్ ఎస్ఐలు లక్ష్మణబాబు, నవీన్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ అప్పన్న, కానిస్టేబుళ్ళు లక్ష్మీనారాయణ, శ్రీనివాస్‌లు నిఘా ఏర్పాటు చేశారు. ఆదివారం అర్ధరాత్రి ఏలూరు మినీ బైపాస్ వడమర లాకుల వద్ద అనుమానాస్పదంగా ఉన్న కొవ్వూరి భానుసుందర్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో ఈ నేరాలు అన్నీ అంగీకరించడంతో అరెస్టు చేసి కోర్టుకు హాజరుపర్చగా రిమాండ్ విధించారు.

తెలంగాణ మద్యం స్వాధీనం..

ఆకివీడు, ఏప్రిల్ 1: తెలంగాణ మద్యం తీసుకొస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి రెండు ఫుల్ బాటిల్స్ స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ బత్తిన నాగబాబు తెలిపారు. పల్నాడు జిల్లాకు చెందిన భూమన కిరణ్‌కుమార్ ఆదివారం రాత్రి తెలంగాణ మద్యం రెండు ఫుల్ బాటిల్స్‌తో వస్తుండగా ఉప్పుటేరు చెక్‌పోస్టు దగ్గర పట్టుకొని కేసు నమోదు చేశామన్నారు. ఒక్కో బాటిల్ విలువ రూ.2 వేలు ఉంటుందన్నారు.

1-04-2024 పొగాకు ధరలు (రూ.)



పొగాకు కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం	సరాసరి
దేవరపల్లి	241	235	239.52
జంగారెడ్డిగూడెం-1	241	235	239.88
జంగారెడ్డిగూడెం-2	241	235	239.65
కొయ్యలగూడెం	240	235	239.90
గోపాలపురం	240	235	238.62



ఇప్పుడు సోషల్ మీడియాదే హవా.. అరచేతిలో ఆండ్రాయిడ్ ఫోన్ ఉంటే చాలు.. ప్రపంచంలో ఏ మూల ఏది జరిగినా ఇట్టే తెలిసిపోతోంది. పట్టణాల నుంచి పల్లెల వరకు ఫేస్‌బుక్, వాట్సప్, ఇన్‌స్టాగ్రాం, యూట్యూబ్, టెలిగ్రాం తదితర యాప్‌లను వినియోగించే వారి సంఖ్య క్రమంగా పెరిగిపోతోంది. సార్వత్రిక ఎన్నికల వేళ రాజకీయ పార్టీలకు సోషల్ మీడియానే ఓ ప్రధాన అస్త్రంగా మారింది. తమ గురించి గొప్పగా ప్రచారం చేసుకుంటూ ప్రత్యర్థులపై బురద జల్లుతూ పోస్టింగ్‌లు పెడుతున్నారు. అయితే.. తస్మాత్ జాగ్రత్త! సోషల్ మీడియాలో ఎన్నికల ప్రచారం చేస్తే ఎన్నికల సంఘం చూస్తూ ఊరుకోదు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటుంది..

● ఇష్టానుసారం పోస్టింగ్‌లు కుదరవు



సామాన్యులతో పాటు ఉద్యోగులు సైతం ఫేస్‌బుక్, ట్విట్టర్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్‌లలో పోస్టులు పెడుతుంటారు. అయితే ప్రస్తుతం ఎన్నికల కోడ్ రావడంతో వీటిపై ఎన్నికల సంఘం ప్రత్యేక నిఘా ఉంచింది. ఏ పార్టీ అభ్యర్థి కోసం ప్రచారం చేసినా చర్యలు తప్పవని స్పష్టం చేసింది. జిల్లాలో ఉన్న పలుశాఖల అధికారులు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు వివిధ పార్టీలకు పరోక్షంగా సహకరించినా, ప్రయత్నించినా ప్రత్యర్థి పార్టీల వ్యక్తులకు సామాజిక మాధ్యమాల్లో ఫొటోలు, వీడియోలు పెట్టినా ఇక అంతే సంగతులు. పోస్టింగులు ఊస్టింగ్ అవుతాయి. పోలింగ్ ముగిసి ఓట్ల లెక్కింపు పూర్తయ్యేవరకు ఉద్యోగులు అప్రమత్తంగా ఉండకపోతే చట్టపరమైన చర్యలు తీసుకోవలసి వస్తుందని ఎన్నికల సంఘం అధికారులు హెచ్చరిస్తున్నారు.

- ప్రచారంలో హైటెక్‌దే హవా!
- పెచ్చుమీరుతున్న రాజకీయ ప్రచారాలు
- సోషల్ మీడియాపై నిఘా
- నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలే!

కోడ్ తప్పితే జైలు తప్పదు



తప్పుడు ప్రచారాలపై నిఘా

భీమవరం క్రైం, ఏప్రిల్ 1 : ఎన్నికల ప్రచారంలో అభ్యర్థులు టెక్నాలజీని ఆశ్రయిస్తున్నారు. రాజకీయ ప్రత్యర్థుల ఫొటోలతో గ్రాఫిక్స్ తయారు చేసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తున్నారు.ఎన్నికల నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో సామాజిక మధ్యమాలలో తప్పుడు ప్రచారాలను ట్రోలింగ్‌లను తీవ్రంగా పరిగణిస్తామని, సోషల్ మీడియా ద్వారా తప్పుడు వార్తల ప్రచారాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఉంచామని అట్టి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల అన్నారు.

● **67 ఐటీ యాక్ట్:** ఆన్‌లైన్ వేధింపులు, సోషల్ మీడియా ట్రోలింగ్‌లకు పాల్పడితే ఈ సెక్షన్ కింద గరిష్టంగా ఐదు సంవత్సరాలు జైలు శిక్షతో పాటు జరిమానా కూడా విధిస్తారు.

● **సెక్షన్ 354:** ఉద్దేశ్యపూర్వకంగా ఒక మహిళను లక్ష్యంగా చేసుకొని వేధిస్తే నేరుగా గాని, సోషల్ మీడియా వేదికల ద్వారా గాని అదే పనిగా సంప్రదించడం, వెంట పడటం దూషించడం, అవమానించడం, వేధించడం వంటివి తీవ్రమైన నేరంగా పరిగణిస్తారు. ఈ సెక్షన్ కింద గరిష్ఠంగా ఐదు సంవత్సరాలు జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తారు

● **సెక్షన్ 123:** జాతి, మతం, కులం, సంఘం, భాషను రెచ్చగొట్టేలా వ్యవహరించడం, ఒత్తిడి గురిచేస్తే ఈ సెక్షన్ కింద కేసు నమోదు చేస్తారు.

● **సెక్షన్ 125:** ఎన్నికల సందర్భంగా వివిధ వర్గాల మధ్య శత్రుత్వాన్ని పెంపొందిస్తే మూడేళ్లపాటు జైలుశిక్ష లేదా జరిమానా ఉంటుంది. ఒక్కో సమయంలో ఈ రెండింటినీ విధించే అవకాశం ఉంది.

● **సెక్షన్ 126:** ఎన్నికల సమయానికి 48 గంటల ముందు బహిరంగ సభలు నిర్వహిస్తే శిక్షార్హులు. దీనికి రెండేళ్ల జైలు లేదా జరిమానా విధిస్తారు.

● **సెక్షన్ 127:** ఎన్నికల సమావేశం సందర్భంగా ఎటువంటి అల్లర్లకు పాల్పడితే నేరుగా పోలీసు అధికారులు ఆ వ్యక్తులను అరెస్టు చేసి కేసు నమోదు చేస్తారు. ఆరు నెలల జైలు శిక్ష లేదా రూ.2 వేల జరిమానా విధిస్తారు.

● **సెక్షన్ 128:** బహి రంగంగా ఓటేసినా 3 నెలల జైలు లేదా జరిమానా విధిస్తారు.

● **సెక్షన్ 129:** అధికారులు, సిబ్బంది, పోలీసు లు పోటీచేసే అభ్యర్థికి సహకరించినా, ప్రభావం కలిగించినా శిక్షార్హులు. దీనికి 3 నెలల జైలుశిక్ష లేదా జరిమానా ఉంటుంది.

● **సెక్షన్ 130:** పోలింగ్ స్టేషన్‌కు 100 మీటర్ల లోపల ప్రచారం చెయ్య కూడదు. ఒకవేళ చేస్తే ఈ సెక్షన్ కింద జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తారు.

● **సెక్షన్ 131:** పోలింగ్ కేంద్రానికి సమీపంలో ప్రచారం చేస్తే ఏ పోలీసు అధికారి అయినా సరే అరెస్టు చేసి ఆ సామగ్రిని స్వాధీనం చేసుకోవచ్చు. 3నెలల జైలుశిక్ష లేదా జరిమానా ఉంటుంది.

● **సెక్షన్ 132:** ఓటేసే సమయంలో నిబంధనలు పాటించని వారికి 3 నెలల జైలు, లేదా జరిమానా విధిస్తారు.

● **సెక్షన్ 134:** అధికార దుర్వినియోగానికి పాల్పడితే జైలుశిక్ష లేదా జరిమానా .

● **సెక్షన్ 134(బీ):** పోలీస్‌స్టేషన్ పరిసర ప్రాంతాలకు మారణాయుధాలతో వెళ్లడం నిషిద్ధం. అలా వెళ్లిన వారికి 2 నెలలు జైలు శిక్ష, జరిమానా..

● **సెక్షన్ 135:** పోలింగ్ కేంద్రం నుంచి బ్యాలెట్ పత్రం, ఈవీఎం అపహరిస్తే శిక్షార్హులు. ఈ కేసుకు ఏడాది జైలుశిక్ష, జరిమానా ఉంటుంది.

● **సెక్షన్ 135(బీ):** ప్రభుత్వ ఉద్యోగులకు ఎన్నికల రోజు వేతన సెలవుగా మంజూరు చేసినా కేసు నమోదు చేస్తారు. జైలు శిక్ష, జరిమానా విధిస్తారు.

● **సెక్షన్ 134(ఏ):** ప్రభుత్వ ఉద్యోగి ఎన్నికల ఏజెంటు, పోలింగ్ ఏజెంటు, ఓట్ల లెక్కింపు సమయంలో ఏజెంటుగా వ్యవహరిస్తే శిక్షార్హులు. దీనికి 3 నెలలు జైలు, జరిమానా ఉంటుంది.

● **సెక్షన్ 49 (పి):** ఒక వ్యక్తి ఓటు మరో వ్యక్తి వేస్తే పోలింగ్ ఆఫీసర్‌కు సదరు ఓటర్ 49(పి) సెక్షన్ ప్రకారం తన ఆధారాలు చూపించాలి. ప్రిసైడింగ్ అధికారి సదరు ఓటర్‌కు ఓటు వేసే అవకాశం కల్పిస్తారు. చూపించలేకపోతే కేసు నమోదు చేసి జైలుకు పంపుతారు.

గ్రూప్ అడ్మిన్ల బాధ్యతలు

వాట్సాప్, ఫేస్‌బుక్ వంటి గ్రూప్‌లో ప్రతీ పోస్టుకి బాధ్యత తీసుకోవాలి.గ్రూప్‌లో యాడ్ చేసే ప్రతీ సభ్యుడు తప్పకుండా అడ్మిన్‌కి తెలిసి ఉండాలి. అభ్యంతరకర, తప్పుడు వార్త, వదంతులపై స్థానిక పోలీసులకు సమాచారమివ్వాలి. ఎవరైనా సభ్యులు అభ్యంతరకరంగా ప్రవర్తిస్తే వెంటనే గ్రూప్ నుంచి తొలగించాలి. ఆ వివాదాస్పద పోస్టింగ్ సంబంధించి అడ్మిన్ ఏం చర్యలు తీసుకోకుంటే అతడిపై పోలీసులు చర్యలు తీసుకుంటారు. అడ్మిన్ వివాదాస్పద పోస్టు చేస్తే ఐటీ చట్టం. ఐపీసీ సెక్షన్ 153 (ఎ) కింద శిక్ష విధిస్తారు. మూడు నుంచి ఐదేళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉంటుంది. కుల, మత వర్గాల మధ్య విభేదాలకు, విద్వేషాలకు దారి తీసే పోస్టులు పెట్టడం, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం, మార్ఫింగ్ చేసిన ఫోటోలు, వీడియోలు వంటివి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌లో గ్రూప్ అడ్మిన్లు, సభ్యులు పోస్ట్ లేదా షేర్ చేస్తే శిక్షార్హులు అవుతారు.

తప్పుడు ప్రచారాలపై ఫిర్యాదు చేయండి : ఎస్పీ అజిత

సోషల్ మీడియా వాడకపై సంక్షిప్త సమాచార కరపత్రాల (బ్రోచర్)ను సోమవారం పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల విడుదల చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా పోలీస్ వాట్సప్ నెంబర్ 70362 26688కు తప్పుడు ప్రచారాలపై ఫిర్యాదు చేయాలన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) భీమారావు, అదపు ఎస్పీ (ఎస్బీబీ) రవికుమార్, తాడేపల్లి గూడెం డీఎస్పీ మూర్తి, భీమవరం డీఎస్పీ నారాయణస్వామి రెడ్డి, నర్సాపురం డీఎస్పీ శ్రీనివాస రావు, పశ్చిమ గోదావరి జిల్లా ఆర్మ్ రిజర్వ్ డీఎస్పీ సత్యనారాయణ, సెబ్ డీఎస్పీ వెంకటరమణ, దిశా డీఎస్పీ నున్న మురళీకృష్ణ, సీసీఎస్ డీఎస్పీ యుగంధర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎస్పీ అజిత, అధికారులు

విస్తృతంగా తనిఖీలు

నగదు, మద్యం స్వాధీనం

ఏలూరు క్రైం, ఏప్రిల్ 1 : సార్వత్రిక ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్టు ఏలూరు ఎస్పీ మేరీ ప్రశాంతి అన్నారు. గడిచిన 24 గంటల్లో జిల్లా వ్యాప్తంగా 15 వేల 240 రూపాయల విలువైన 47.12 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ టీమ్‌లు రెండు లక్షల 16 వేల 600 రూపాయలు నగదు స్వాధీనం చేసుకున్నారన్నారు.

పిప్పరలో రూ.75 వేలు సీజ్

గణపవరం : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రతీ వ్యక్తి కోడ్‌ను ఉల్లంఘించరాదని నిడమర్రు సీఐ ఎంవీ సుభాష్ కోరారు. సోమవారం పిప్పర మూడు రోడ్ల కూడలిలో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఒక వాహనంలో రూ.75 వేలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. ఎస్ఐ వెంకటేశ్వరరావు, అధికారులు టీఎల్ సరస్వతి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

కె.కోటలో రూ.75 వేలు స్వాధీనం

కామవరపుకోట : కామవరపుకోట పంచాయతీ కొత్తూరు ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్ సమీపంలో ఎన్నికల చెక్‌పోస్టు వాహనాల తనిఖీల్లో ఒక వ్యక్తి నుంచి రు.73 వేలు ఎన్నికల అధికారి మొహిద్దీన్ స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. తడికలపూడి ఏఎస్ఐ వీరాస్వామి, ఫ్లయింగ్‌స్క్వాడ్ అధికారి ఎస్.సత్యవాణి, గణేష్ పాల్గొన్నారు. వాహనాలపై నిఘా పెంచాలని జంగారెడ్డిగూడెం డీఎస్పీ రవిచంద్ర అన్నారు. సోమవారం ఆయన చెక్‌పోస్టును పరిశీలించారు.

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం జాతీయ ప్రధాన రహదారిపై విద్యుత్ డివిజన్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద కుక్కునూరు సందీప్ అనే వ్యక్తి నుంచి రూ.69,500 నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఏఆర్‌వో, తహసీల్దార్ కె.స్లీవజోజి తెలిపారు. ఎటువంటి ఆధారాలు చూపక పోవడంతో సీజ్ చేసినట్లు తెలిపారు. ఎస్ఎస్‌టీ బృందం సభ్యులు ఐసీడీఎస్ సీడీపీవో బ్యూలా, హెడ్‌కానిస్టేబుల్ జె.మోషే, చెక్‌పోస్టు సిబ్బంది పాల్గొన్నారు.

235 మంది బైండోవర్

ఆకివీడు : ఎన్నికల నేపథ్యంలో ఇప్పటివరకు 235 మందిని బైండోవర్లు చేశామని ఎస్ఐ బత్తిన నాగబాబు తెలిపారు. రౌడీషీటర్స్, అను మానితులు, ఇతర పోలీసు కేసుల్లో ఉన్న వారిని బైండోవర్ చేశామన్నారు.



కె.కోట చెక్ పోస్టు వద్ద నగదు స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

రంగుల వాహనంలోనే రేషన్ పంపిణీ

పెంటపాడు, ఏప్రిల్ 1 : ఎన్నికల కోడ్ అమలుపై అధికారుల తీరు ఇంకా మారడం లేదు. ప్రజలకు నిత్యం అవసరమయ్యే ప్రభుత్వ వాహనాలపై రంగులు తీయడం లేదు. సోమవారం నుంచి మండలంలో రేషన్ పంపిణీని అధికారులు మొదలు పెట్టారు. వాహనానికి ఉన్న రంగులు మాత్రం తొలగించలేదు. కోడ్ అమలులో ఉన్న సమయంలో అధికార పార్టీ రంగులతో ఉన్న వాహనంపై రేషన్ ఇవ్వడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.



పెంటపాడు మండలం రాచర్లలో వైసీపీ రంగుల వాహనంలోనే రేషన్ పంపిణీ చేస్తున్న సిబ్బంది

సంపద కేంద్రం రంగు మారింది

ఇరగవరం, ఏప్రిల్ 1 :రాపాక గ్రామంలో సంపద తయారీ కేంద్రానికి ఉన్న వైసీపీ రంగులు తొలగాయి. కోడ్ అమలులోకి వచ్చినా సంపద కేంద్రాలు, రైతు భరోసా కేంద్రాలు, శిలాఫలకాల దిమ్మలకు వైసీపీ రంగులతోనే కనిపిస్తున్నాయి. దీనిపై గ్రామాల్లో సక్రమంగా కోడ్ అమలు కావడం లేదని ఆంధ్రజ్యోతిలో 'వీటికి కోడ్ వర్తించదా' అనే శీర్షిక శనివారం వార్త ప్రచురణ జరిగింది. దీనిపై స్పందించిన రాపాక పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసు సంపద కేంద్రానికి సున్నం వేయించారు.



పాటదారుడికే రేవు బాధ్యతలు అప్పగింత

నరసాపురం టౌన్, ఏప్రిల్ 1: మాధవాయిపాలెం రేవు నిర్వహణ బాధ్యతల్ని సోమవారం పాత పాటదారుడు రెడ్డప్ప ధవేజీకి అప్పగించింది. మళ్లీ పాట నిర్వహించే వరకు ఆయనే చేపట్టనున్నారు.ఇందుకు రోజుకు ప్రభుత్వానికి రూ.1.05 లక్షలు చెల్లించాల్సి ఉంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను గత నెల మార్చిలో పాట నిర్వహించాల్సి ఉంది. అయితే ఎన్నికల కోడ్ రావడంతో రద్దు అయింది. ఈ నేపథ్యంలో జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశమై రోజువారి పద్ధతిలో ధవేజీకి అప్పగించాలని తీర్మానించి ప్రభుత్వానికి పంపింది. జిల్లా ఆధికారులు ఆమోదించడంతో పాట పెట్టే వరకు పాత పాటదారుడే నిర్వహించనున్నారు.

సీనియర్ లైన్‌మేన్‌పై కేసు నమోదు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 1 : విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఓ సీనియర్ లైన్‌మేన్‌పై ఏలూరు త్రిటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శాంతినగర్ డీ3 విద్యుత్ సెక్షన్‌లో కొత్తపల్లి రామకృష్ణ సీనియర్ లైన్‌మేన్‌గా పనిచేస్తున్నారు. సత్రంపాడులోని ఎన్‌టీఆర్ సర్కిల్ సమీపంలోని ఓ ఇంటికి విద్యుత్ సమస్య ఏర్పడడంతో గత నెల 12న అక్కడ విద్యుత్‌ను పునరుద్ధరించేందుకు జూనియర్ లైన్‌మేన్ అయిన వినోద్ బాబును వెంట తీసుకుని వెళ్లారు. వినోద్‌బాబును విద్యుత్ స్తంభం ఎక్కించి పనులు చేయిస్తుండగా ఒక్కసారిగా విద్యుత్ రావడంతో వినోద్‌బాబు విద్యుదాఘాతానికి గురై కిందపడ్డాడు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న అతన్ని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స నందించారు. వినోద్‌బాబు ప్రమాదానికి గురవడానికి రామకృష్ణ నిర్లక్ష్యమే కారణమని వినోద్‌బాబు భార్య నవ్యశ్రీ ఫిర్యాదు చేయడంతో సోమవారం రామకృష్ణపై త్రిటౌన్ సీఐ వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు హెచ్‌సీ ఏసోబు కేసు నమోదు చేశారు.

నూతన పైప్‌లైన్ ఏర్పాటుకు చర్యలు

ముసునూరు, ఏప్రిల్ 1: రమణక్కపేట అరుంధతి కాలనీలో తాగునీటి సమస్యపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. సోమవారం ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, కార్యదర్శి ప్రసాద్, కాలనీలో నీటి సరఫరా చేసే మంచి నీటి ట్యాంకులు, సంబంధిత పైప్‌లైన్‌లను పరిశీలించారు. వాటర్ ట్యాంకుల్లో నీరు ఉన్నప్పటికీ కుళాయిల్లో నీరు రాకపోడంతో అక్కడక్కడ పైప్‌లైన్‌లను తవ్విచూశారు. పైప్‌లైన్ బ్లాక్ అవడం వల్లే ఒక వాటర్ ట్యాంక్ నుంచి నీరు రావడం లేదని గుర్తించారు. ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు మాట్లాడుతూ పైప్‌లైన్‌లో అక్కడక్కడ బ్లాక్ అవడం వల్ల సమృద్ధిగా నీరు రావడం లేదని పాత పైప్‌లైన్‌ను తొలగించి, సుమారు 110 మీటర్ల హెచ్‌డీపీఈ పైప్‌లతో పైప్‌లైన్ వేసే పనులను ప్రారంభిస్తామన్నారు.

క్రైం కార్నర్

ఈస్టర్ పండుగ కోసం వస్తుండగా ప్రమాదం

భర్త మృతి..భార్యకు గాయాలు



ప్రమాదంలో మృతి చెందిన పవన్ కుమార్

పోలవరం, ఏప్రిల్ 1 : ఈస్టర్ పండుగ కోసం భార్యతో కలిసి వస్తూ రోడ్డు ప్రమాదంలో భర్త మృతి చెందగా భార్యకు తీవ్ర గాయాలపాలైన సంఘటన కోట రామచంద్రపురం ఐటీడీఏ సమీపంలో ఆదివారం రాత్రి జరిగింది. పోలవరం పంచాయతీ కమ్మరగూడెం గ్రామానికి చెందిన చిన్నం పవన్ కుమార్ (28) కుటుంబంతో సహా ఇటీవల కన్నాపురం పుగాకు సీజను పనికి మకాం వెళ్ళాడు. ఈస్టర్ పండుగ సందర్భంగా తన భార్యతో బైకుపై పోలవరం వస్తుండగా ఐటీడీఏ సమీపంలో మలుపు వద్ద బైకు అదుపు తప్పి చెట్టుని ఢీకొట్టడంతో పవన్ కుమార్, అతని భార్య వేణికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని జంగారెడ్డిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించగా పవన్ కుమార్ మృతి చెందగా భార్యని మెరుగైన చికిత్స కోసం రాజమహేంద్రవరం తరలించారు. ఐదు నెలల క్రితమే ఇద్దరికి వివాహమైందని రోడ్డు ప్రమాదం కుటుంబంలో విషాదం మిగిల్చిందని మృతుడి తండ్రి వీరన్న కుటుంబీకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఒకరి అనుమానాస్పదస్థితి మృతి

చింతలపూడి, ఏప్రిల్ 1:చింతలపూడికి చెందిన వివాహితుడు నరం రమేష్ (30) మృతదేహాన్ని అనుమానాస్పద స్థితిలో సోమవారం కనుగొన్నారు. వృత్తి రీత్యా సెలూన్ నిర్వహిస్తుండటాడని, వారం రోజుల క్రితం ఒక అమ్మాయిని తీసుకువెళ్లాడని ఇంట్లో పెద్దలు మందలించారు. ఆ కోపంతో ఇంట్లోంచి వెళ్లిపోయాడు. అతని చేలోనే మృతదేహాన్ని గొర్రెల కాపరులు కనుగొని సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి వెళ్ళి పోలీసులు పరిశీలించారు. అప్పటికే మృతదేహం బాగా కుళ్ళిపోయిందని, చేతిపై బ్లేడుతో కోసుకున్న గీతలు కూడా ఉన్నాయని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం జరిపి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కుటుంబరావు తెలిపారు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని తెలిపారు.

ఆటో-బైక్ ఢీ..యువకుడికి గాయాలు

జీలుగుమిల్లి, ఏప్రిల్ 1: బర్రింకలపాడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు గాయ పడ్డాడు. గ్రామానికి చెందిన కుంజం ప్రేమ్‌కుమార్ జీలుగుమిల్లి వైపు బర్రింకలపాడు నుంచి వస్తుం డగా నాలుగు రోడ్ల కూడలి వద్ద ప్రమాదవశాత్తు ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో కాళ్లు చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. జీలుగుమిల్లి పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స చేశారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో జంగారెడ్డిగూడెం ఆస్పత్రికి తరలించారు.

ఉరి వేసుకుని జ్యూట్ మిల్లు కార్మికుడి ఆత్మహత్య

ఏలూరు క్రైం, ఏప్రిల్ 1 : కారణం తెలియదు కాని ఒక వ్యక్తి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు సమీపంలోని కొత్తూరులో ఉన్న ఇందిరా కాలనీకి చెందిన గంపా చంటి (45)కు భార్య భవానీ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆరు సంవత్సరాల క్రితం భార్య, పిల్లలతో విడిపోయి ఒంటరిగా ఉంటున్నాడు. జ్యూట్ మిల్లులో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. సోమవారం తాను ఉంటున్న ఇంట్లోనే ఉరి వేసుకున్నారు. సాయంత్రం ఇరుగు పొరుగు వారు చూసి ఏలూరు రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో రూరల్ ఎస్ఐ రాజారెడ్డి తన సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

లారీ డ్రైవర్ మృతి

పెదపాడు, ఏప్రిల్ 1: సిమ్మెంట్ లోడుతో వెళుతున్న లారీలో డ్రైవర్ అస్వస్థతకు గురై మృతి చెందిన సంఘటనపై పెదపాడు పోలీసులు సోమ వారం కేసు నమోదు చేశారు. విజయవాడ సింగ్‌నగర్‌కు చెందిన తోపూరి కోటేశ్వరరావు (62) మార్చి 31వ తేదీన బయలుదేరి సిమ్మెంట్ లోడుతో జగ్గయ్యపేట నుంచి విశాఖపట్నం వెళుతూ మార్గమధ్యలో పెదపాడు మండలం కలపర్రు టోల్‌గేట్ వద్దకు వచ్చేసరికి అస్వస్థతకు గురయ్యాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో అప్పటికే మృతి చెందిన కోటేశ్వరరావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్ఐ శుభశేఖర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కోడిపందేలపై దాడి..కేసు నమోదు

యలమంచిలి/ఆకివీడు ఏప్రిల్ 1: శిరగాలపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న కోడిపందేల శిబిరంపై సోమవారం దాడి చేసి ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.శివన్నారాయణ తెలిపారు. మూడు పందెం కోళ్లు, నాలుగు మోటారు సైకిళ్లు, రూ.4200 నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు. చెరుకుమిల్లిలో ఐదుగుర్ని అదుపులోకి తీసుకొని రెండు కోడిపుంజులు, రెండు కత్తులతో పాటు రూ.4,500 స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ బత్తిన నాగబాబు తెలిపారు.

మామపై అల్లుడు యాసిడ్ దాడి

చికిత్స పొందుతూ మృతి



నాగేశ్వరరావు(ఫైల్)

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 1 :పిల్లనిచ్చిన మామపై అల్లుడు యాసిడ్ దాడికి పాల్పడిన ఘటన జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం గ్రామంలో చోటు చేసుకుంది. యాసిడ్ దాడిలో తీవ్రంగా గాయపడిన ప్రగడ నాగేశ్వరరావు (65) చికిత్స పొందుతూ మృతి చెందినట్టు సీఐ రాజేష్ తెలిపారు. జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం గ్రామానికి చెందిన నాగేశ్వరరావుకి ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు మగ పిల్లలు. పెద్ద కుమార్తె కృష్ణవేణికి, టి.నరసాపురం మండలం వల్లంపట్ల గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ రంగిశెట్టి రమేష్‌కు 22 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. రమేష్ తన భార్య కృష్ణవేణిని వేధింపులకు గురి చేసేవాడు. వేధింపులు తాళలేక గత సంవత్సరం క్రితం కృష్ణవేణి పుట్టింటికి వచ్చి తల్లిదండ్రుల వద్దే ఉంటోంది. తన భార్యని మావయ్యే దగ్గర కాకుండా దూరం పెడుతున్నాడని రమేష్ అనుమానం పెంచుకున్నాడు. ఈ క్రమంలోనే సోమవారం అర్ధరాత్రి 1 గంట సమయంలో లక్కవరంలో ఇంటిలో నిద్రిస్తున్న నాగేశ్వరరావుపై రమేష్ బ్యాటరీలలో వినియోగించే యాసిడ్ వాటర్ పోసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. నాగేశ్వరరావు పెద్దగా కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు 108 వాహనంలో జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా మారడంతో ఏలూరు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నాగేశ్వరరావు సోమవారం ఉదయం మృతి చెందాడు. దాడికి పాల్పడిన రమేష్ పరారీలో ఉండటంతో జంగారెడ్డిగూడెం డీఎస్పీ రవిచంద్ర ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపట్టారు. మృతుడి భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఫిర్యాదు చేసిన రెడ్డి చందు, మహేష్ యాదవ్, తదితరులు

ఏపీపీఎస్సీ అక్రమార్కులను శిక్షించాలి

ఏలూరు క్రైం, ఏప్రిల్ 1: ఏపీపీఎస్సీ అభ్యర్థుల ఎంపికలో అవినీతికి పాల్పడ్డ వారిపై తక్షణం కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పెనుబోయిన మహేష్‌యాదవ్, తెలుగుయువత అధ్యక్షుడు రెడ్డి సూర్యచంద్రరావు డిమాండ్ చేశారు. ఏలూరు త్రి టౌన్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం వారు ఫిర్యాదు చేశారు. ముఖ్య మంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఏపీపీఎస్సీ ఛైర్మన్ గౌతమ్ సవాంగ్, కార్యదర్శి పీఎస్ఆర్ ఆంజనేయులుపై కేసు నమోదు చేసి చట్ట ప్రకారం అరెస్టు చేయాలన్నారు. సంతలో పశువులను అమ్మినట్లు ఉద్యోగాలను అమ్మేశారని ఆరోపించారు. తెలంగాణలో ఇదే విధంగా కుంభకోణాలకు పాల్పడితే కేసీఆర్‌కు అక్కడ ప్రజా కోర్టు శిక్ష వేసిందని ఏపీ ప్రజానీకం కూడా జగన్‌కు ప్రజాకోర్టు శిక్ష విధిస్తుందన్నారు. ఈకార్యక్రమంలో ఏలూరు నియోజకవర్గం అధ్యక్షుడు వేగి సిద్ధు, చింతలపూడి నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షుడు నత్తా నగేంద్ర, ఏలూరు నియోజకవర్గ టీఎన్ఎస్ ఎఫ్ ప్రధాన కార్యదర్శి మారం సూర్య, నాయకులు కమలాల వంశీ, పి.కిషోర్, వేమూరి రాధాకృష్ణ, కొమ్మారెడ్డి మణికంత, నాగేంద్ర పలువురు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



జైనవారిగూడెంలో అభయాంజనేయుడి విగ్రహం

బుట్టాయగూడెం, ఏప్రిల్ 1: జైనవారిగూడెం రామాలయం ఎదురుగా అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. జైనవారిగూడెం చుట్టుపక్కల గ్రామాల వారు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. బుట్టాయగూడెంకు చెందిన కొండేపాటి రామకృష్ణ, జంగారెడ్డిగూడెంకు చెందిన జవ్వాది ఉమా వెంకట్ సహకరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరగ్గా స్వామివారి ప్రసాదాన్ని భక్తులు స్వీకరించారు. దాసరి రాంబాబు, అనిశెట్టి రామకృష్ణ, తాటి సీత కార్యక్రమాల నిర్వహించగా బీజేపీ నాయకులు సోము హరినారాయణ, వెంకటరమణ అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

దత్తాశ్రమంలో నేడు సామూహిక అనఘాష్టమి వ్రతాలు

ఏలూరు కార్పొరేషన్, ఏప్రిల్ 1: దొండపాడు దత్తనాథ క్షేత్రం వద్ద మంగళవారం పాల్గుణ బహుళ అష్టమి సందర్భంగా సామూహిక అఘాష్టమి వ్రతాలు జరిపిస్తున్నట్లు దత్తపీఠం అర్చకులు రామకృష్ణ తెలిపారు. వ్రతాలలో పాల్గొనేవారు పేర్లు నమోదు చేయించుకుని సకాలంలో హాజరు కావాలని ఆయన సూచించారు.

కనకదుర్గమ్మ ఆలయంలో ఉత్సవాలు



టి.నరసాపురం, మార్చి 1: మక్కినవారిగూడెం కనకదుర్గమ్మ ఆలయం వద్ద ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సోమవారం ప్రారంభమైన ఉత్సవాలు మూడు రోజుల పాటు కొనసాగుతాయి. ఉత్సవాల మొదటి రోజు నుంచి భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాలకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది.

చెరువులపై రజకులకు శాశ్వత హక్కు కల్పించాలి



సమావేశంలో రజక నాయకులు కట్లయ్య

చింతలపూడి, ఏప్రిల్ 1: రజక వృత్తి వారికి చెరువులపై శాశ్వత హక్కు కల్పించాలని రజకసంఘ ఉమ్మడి పశ్చిమ జిల్లా అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య, గౌరవాధ్యక్షుడు పగడాల సాంబశివరావు డిమాండ్ చేశారు. చింతలపూడి రజక సంఘ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. రజకులకు చెరువుల కేటాయింపులో అధికారులు నిర్లక్ష్య వైఖరి విడనాడాలన్నారు. కొన్నింటికి జీవోలు ఇచ్చినా అమలు చేయడం లేదని, దీనివల్ల రజకులు నష్టపోతున్నారన్నారు. తరతరాలుగా వృత్తి చేసుకునే చెరువులు కేటాయింపులో ఆయా పంచాయతీల్లో శాశ్వతహక్కు పొందలేక పోతున్నారని వాపోయారు. ప్రభుత్వం దోబీ ఘాట్లకు ఉచిత కరెంటు ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చినప్పటికీ విద్యుత్‌శాఖ అమలు చేయడం లేదన్నారు. జిల్లాలో అనేక గ్రామాల్లో రజకులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. రజకులకు రాజకీయాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. రజకుల సమస్యలు పరిష్కరించటంలో ఉమ్మడి జిల్లాలోని డివిజనల్ పంచాయతీ అధికారులతో సమావేశాలు నిర్వహించి రజకులకు ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో సంఘ నాయకులు పునిగడ్డ ప్రసాద్, నిమ్మగడ్డ దుర్గారావు, కొమ్మరాజు నాంచారయ్య, నిడికొండ నారాయణ, నేరెళ్ళ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'స్పాట్' బకాయిలు, సౌకర్యాల కోసం పీఆర్టీయూ వినతి

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 1: గతేడాది పదో తరగతి స్పాట్ వాల్యూయేషన్ సిబ్బందికి చెల్లించాల్సిన టీఏ, డీఏ, కంటింజెంట్ బకాయిలు తక్షణమే చెల్లించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు డిమాండ్ చేశారు. టెన్త్ జవాబుపత్రాల మూల్యాంకనం జరుగుతున్న స్థానిక సెయింట్ గ్జేవియర్ హైస్కూలు క్యాంపులో పరీక్షల ప్రభుత్వ పరిశీలకుడు ఆర్.నరసింహారావు, డీఈవో అబ్రహంను కలుసుకుని ఈమేరకు అభ్యర్థించారు. ఎండల తీవ్రతదృష్ట్యా స్పాట్ క్యాంపులో జవాబుపత్రాలను దిద్దే సిబ్బందికి సౌకర్యవంతంగా వుండేలా తగినన్ని ఫ్యాన్లు ఏర్పాటుచేయాలని కోరారు. సుబ్బారావు, శ్రీనివాసరావు, రాము, రాజాబాబు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

బ్యూటీపార్లర్, ఫొటోగ్రఫీలో ఉచిత శిక్షణ

పెదపాడు, ఏప్రిల్ 1: యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా గ్రామీణ నిరుద్యోగ యువతకు శిక్షణ ఇవ్వనున్నారు. సత్రంపాడులోని సంస్థ కార్యాలయంలో బ్యూటీపార్లర్, ఫొటోగ్రఫీ, వీడియో మిక్సింగ్‌పై 30 రోజుల ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ కె.శశిధర్ సోమవారం తెలిపారు. 10వ తరగతి ఆపైన చదివిన గ్రామీణ యువతులకు బ్యూటీపార్లర్, ఫొటోగ్రఫీ, వీడియో మిక్సింగ్‌పై 10వ తరగతి ఆపై చదివిన గ్రామీణ ప్రాంత యువతీ, యువకులకు మాత్రమే శిక్షణ ఇవ్వబడుతుందన్నారు. శిక్షణా కాలంలో ఉచిత భోజనం, వసతి కల్పించబడుతుందన్నారు. ఆసక్తిగలవారు ఆధార్, రేషన్‌కార్డు జిరాక్స్‌లు, మూడు ఫొటోలు తీసుకురావాలన్నారు. వివరాల కోసం 9502723356, 9948565256 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

రామ్మోహన్‌కు మాస్ లైన్ ప్రజాపంథా మద్దతు

బుట్టాయగూడెం, ఏప్రిల్ 1: పోలవరం అసెంబ్లీ స్థానానికి సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎస్.రామ్మోహన్‌కు సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా మద్దతు తెలిపినట్లు న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి టి.సుధాకర్ తెలిపారు. ప్రజాపంథా కేంద్ర కమిటీ నాయకుడు పోటు రంగారావు తెలిపారని సుధాకర్ అన్నారు. రెండు పార్టీలు పోలవరం నియోజకవర్గంలో పేదల పక్షాన అనేక పోరాటాలు చేశాయన్నారు. గిరిజనులు అభివృద్ధి కోసం కృషిచేశాయని రామ్మోహన్‌కు మద్దతు ఇవ్వడం సంతోషమన్నారు.

నేడు ఆయుష్ ఉచిత వైద్య శిబిరం

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 1: ఏలూరు ఆయుష్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో దొండపాడులోని దత్తాశ్రమంలో మంగళవారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు ఆస్పత్రి మేనేజర్ కాశీనాథ్ సోమవారం తెలిపారు. మధుమేహం, రక్తపోటు, స్త్రీల వ్యాధులు, గ్యాస్ట్రో ఎంటరాలజీ, గుండెజబ్బులు, ఎముకల సంబంధిత సమస్యలతో వున్నవారు హాజరుకావచ్చునన్నారు. ఉచిత వైద్యపరీక్షలు, అవసరమైనవారికి మందులు ఇస్తామన్నారు. వివరాలకు ఆస్పత్రి ఫోన్‌నెంబర్లు 90595 72676, 78938 39452లలో సంప్రదించాలని కోరారు.

దైవ సువార్తీకులు కాట్రు నాగరాజు మృతి

పోలవరం, ఏప్రిల్ 1 : పోలవరం పంచాయతీ కమ్మరగూడెం గ్రామానికి చెందిన దైవ సువార్తీకులు కాట్రు నాగరాజు (జేసుదాసు) (80) మృతి చెందారు. పోలవరంలో యెరూషలేము హోబ్రోను చర్చి ఫాదర్‌గా గత 50 ఏళ్ల సేవలందించారు. అన్ని కులాల మతాల వారిని ప్రేమగా ఆదరించి సువార్త అందించే వారని, పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారని ఆయన లేని లోటు తీరనిదని పోలవరం మండల పాస్టర్స్ అసోసియేషన్ సభ్యులు రెవరెండ్ ఆకుమర్తి డేవిడ్‌రాజు, పీజే.సుధాకర్, సామ్యూల్ రాజు, సంపతిరావు, రొక్కల మేషెక్ తదితరులు అన్నారు.



విలేకరుల సమావేశంలో గన్ని, పుట్టా మహేష్ యాదవ్



జంగారెడ్డిగూడెంలో పథకాలు వివరిస్తున్న నేతలు

ఏలూరు జిల్లా

అభివృద్ధి చేస్తా

కూటమి ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్

ఏలూరు రూరల్, ఏప్రిల్ 1: ఏలూరు ఎంపీగా తనను గెలిపించాలని, పార్లమెంట్ నియోజకవర్గంలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎన్‌డీఏ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్ అన్నారు. తెలుగు దేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులతో కలసి సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నానని సమస్యలు తెలుసుకుంటున్నానన్నారు. గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక పాలనను అంతమొందించాలంటే ఎన్‌డీఏ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. మహేష్‌యాదవ్ ఎంపీ అయితే పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడానికి కృషిచేస్తారన్నారు. చింతలపూడి ఎత్తిపోత పథకానికి టీడీపీ హయాంలో రూ.4 వేల కోట్లు ఖర్చుపెడితే ఆ ప్రాజెక్టుకు వైసీపీ కనీసం పూర్తి చేయలేకపోయిందని మండిపడ్డారు. ఆక్వా రైతులు, కొల్లేరు కాంటూరి సమస్య డెల్టాలో మంచినీటి సమస్య పరిష్కరించాలంటే పుట్టా యాదవ్‌ను గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. వృద్ధులు, దివ్యాంగులకు ఫెన్షన్ల విషయంలో ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు వాలంటీర్లను దూరంగా ఉంచిందని స్పష్టం చేశారు. దీనిని వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. ప్రజలకు వాస్తవాలు తెలుసున్నారు.

జీతాలు ఇవ్వలేని స్థితిలో ప్రభుత్వం : బడేటి చంటి

ఏలూరు రూరల్: జీతాలు కూడా ఇవ్వలేని స్థితికి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దిగజార్చిన సీఎం జగన్ అని నియోజకవర్గ టీడీపీ, జనసేన,బీజేపీ ఉమ్మడి అభ్యర్థి బడేటి చంటి, జనసేన ఏలూరు ఇన్‌చార్జ్ రెడ్డి అప్పలనాయుడు ఆరోపించారు. ఏలూరు 50వ డివిజన్ ఎమ్మార్సీకాలనీ ఎన్టీఆర్ విగ్రహం వద్ద సోమవారం సాయంత్రం జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం 12వ డివిజన్ మార్కండేయ స్వామి గుడివద్ద ప్రజాగళం కార్యక్రమాన్ని నిర్వహించారు. బడేటి చంటి, రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా తన తాబేదారులైన సొంత కాంట్రాక్టర్లకు పింఛన్ సొమ్ముతో పాటు ప్రభుత్వ నిధులు దోచిపెట్టిన జగన్‌రెడ్డి దాన్ని కప్పిపుచ్చుకునేందుకు ఎన్నికల కమిషన్, టీడీపీ పై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. టీడీపీ నగర శాఖ అధ్యక్షుడు పెద్దిబోయిన శివప్రసాద్, జనసేన ఏలూరు నగర అధ్యక్షులు నాగిరెడ్డి, కాశీ నరేష్, రెడ్డిగౌరీశంకర్, వీరంకి పండు, క్లస్టర్ ఇన్‌చార్జ్ అమరావతి అశోక్, డివిజన్ ఇన్‌చార్జ్ మంత్రి మహాలక్ష్మినాయుడు, జనసేన డివిజన్ ఇన్‌చార్జ్ తుమ్మల ఉమదుర్గ, టీడీపీ నాయకులు కొరడా బాలకృష్ణ, ఊటి రమణ, గంగా, టీడీపీ నాయకులు, జనసేన నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

గుంటుపల్లిలో టీడీపీ నేతల ప్రచారం

కామవరపుకోట: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులు సొంగా రోషన్‌కుమార్‌ను ఎమ్మెల్యేగా, పుట్టా మహేష్ యాదవ్‌ను ఎంపీగా గెలిపించాలని ఆదివారం రాత్రి గుంటుపల్లిలో ఇంటింటి ప్రచారం చేశారు. మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ, సర్పంచ్ గోరింక దాసు, ఎంపీటీసీ కంఠమనేని పుష్పరాజ్యం, బేతిన వెంకట్రావు, మొక్కపాటి ప్రసాద్ పాల్గొన్నారు.



అచ్యుతాపురంలో చిర్రి బాలరాజు, జనసేన, టీడీపీ, బీజేపీ నేతలు

మౌలిక సదుపాయాలు కల్పిస్తాం : చిర్రి బాలరాజు

కొయ్యలగూడెం: మౌలిక సదుపాయాలు కల్పించడానికి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి కృషి చేస్తుందని కరాటం రాంబాబు, పోలవరం ఎమ్మెల్యే అభ్యర్థి చిర్రి బాలరాజు అన్నారు. అచ్యుతాపురంలో టీడీపీ, జనసేన నాయకులు కార్యకర్తలతో సమావేశమ య్యారు. గ్రామానికి రహదారులులేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, వర్షాకాలంలో తమ పిల్లల్ని జాతీయ రహదారి వరకు తీసుకెళ్లి బస్సులు ఎక్కిస్తున్నామని స్థానికులు ఇబ్బందులు వివరించారు. కరాటం రాంబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక గ్రామంలోని మౌలిక సదుపాయాలు కల్పించాకే గ్రామంలోకి వస్తామని హామీ ఇచ్చారు. నిమ్మగడ్డ రాంబాబు, వినోద్, గంగిరెడ్ల మేఘలాదేవి, చోడిపిండి సుబ్రహ్మణ్యం, దుగ్గిన శ్రీను, తోట రవి, ఈపూరి సతీష్, సంకు మధు, శ్రీను, మధుబాబు, సన్నంశెట్టి సూర్యచంద్రం, గంగాధరం పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలు వివరించిన నేతలు

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని 1వ వార్డులో సోమవారం సాయంత్రం శంఖారావం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు రావూరి కృష్ణ, మానికల వెంకటేశ్వరరావు, మండవ లక్ష్మణరావు, పెనుమర్తి రామకుమార్, అల్లూరి రామకృష్ణ, చెరుకూరి శ్రీధర్, రాజాన సత్యనారాయణ, బొబ్బర రాజ్‌పాల్ కుమార్, తూటికుంట రాము, మాణికల నాగేశ్వరరావు, నంబూరి రామచంద్రరాజు, జనసేన కౌన్సిలర్ వలవల తాతాజీ, కొండ్రెడ్డి కిషోర్, జనసేన నాయకులు పీరు, ఉమామహేశ్వ, చింతల నాని తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల సొమ్ము

జగన్ రెడ్డి దోచేశాడు

● పంపిణీ వాయిదా.. టీడీపీ, ఎన్నికల సంఘంపై నెపం ● ప్రజలు గమనిస్తున్నారు : టీడీపీ నేతల ధ్వజం

భీమడోలు, ఏప్రిల్1: అవ్వా తాతల పింఛన్ సొమ్ము జగన్ రెడ్డి దోచేశాడని, తనకు కావాలసిన కాంట్రాక్టర్లకు చెల్లింపుల కోసం నిధులు పక్కదారి పట్టించారని తెలుగుదేశం పార్టీ నేతలు ధ్వజమెత్తారు. నిధులు లేక 1న పింఛన్లు ఇవ్వలేకపోయారని, టీడీపీ, ఎన్నికల సంఘం కారణమని ప్రజలను మోసగిస్తున్నారని ఆరోపించారు. జిల్లాలో పలుచోట్ల టీడీపీ నాయకులు విలేకరుల సమావేశాలు ఏర్పాటుచేసి జగన్ రెడ్డి వైఖరిని ఎండగట్టారు. భీమడోలులో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ సచివాలయ సిబ్బందితో ఇంటింటికి పింఛన్లు పంపిణీ చేయించాలని డిమాండ్ చేశారు. పింఛన్ల సొమ్మును జగన్ ప్రభుత్వం పక్కదారి పట్టించడంతో లబ్ధిదారులకు పంపిణీ చేయలేదన్నారు. సచివాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శులతో పింఛ న్లు పంపిణీ చేయడానికి ప్రభుత్వం దగ్గర సొమ్ము లేదన్నారు. ఈనెల 3న పింఛన్ల పంపిణీ కూటమి పార్టీల నేతలు పర్యవేక్షిస్తారన్నారు. సమావేశంలో కొండబాబు, పుల్లయ్యనాడు, పెద్దిరాజు పాల్గొన్నారు.

పింఛన్ల నిలుపుదలకు జగన్ కుట్ర : చింతమనేని



పెదవేగి: అవ్వా తాతల పింఛన్ల పంపిణీ వాయిదా వెనుక జగన్‌రెడ్డి హస్తం ఉందని మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆరోపించారు. పింఛన్ల సొమ్ము పంపిణీ అంశంపై సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పింఛన్ల సొమ్ముతో పాటు ప్రభుత్వ నిధులు రూ.13వేల కోట్లు మార్చి 16 నుంచి 30 మధ్య 15రోజుల వ్యవధిలో సొంత కాంట్రాక్టర్లకు దోచిపెట్టారన్నారు. ఈ విషయాన్ని దాచిపెట్టి చంద్రబాబు కారణంగానే పింఛన్లు ఇవ్వలేకపోతున్నామని టీడీపీ, ఎన్నికల సంఘంపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన విమర్శించారు. లబ్ధిదారులు సచివాలయానికి వెళ్లి పింఛన్లు తీసుకోవాలని చెబుతున్నారని, గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో ఇంటింటికీ పింఛన్లను పంపిణీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. వలంటీర్లను వైసీపీ కార్యక్రమాలకు వాడుకుంటూ కోడ్ ఉల్లంఘన తో ఎంతో మంది వలంటీర్లపై చర్యలకు జగన్‌రెడ్డి కారకుడయ్యాడని ప్రభా కర్ తెలిపారు. పింఛనుదారులపై జగన్‌కు ఏమాత్రం శ్రద్ధ ఉన్నా ఖజానాలో సొమ్మును కాంట్రాక్టర్లకు దోచిపెట్టేవాడు కాదన్నారు. జగన్ ప్రజా వ్యతిరేక పనులను ప్రజలు గమనిస్తున్నారని, వచ్చే నెలలో జరిగే ఎన్నికల్లో జగన్‌కు తగిన బుద్ధి చెప్పడానికి జనం సిద్ధంగా ఉనానరని ప్రభాకర్ వివరించారు.

పింఛన్ల సొమ్ము మింగేశారు : దాసరి శేషు



జంగారెడ్డిగూడెం: పింఛన్ల సొమ్ము మెక్కేసి పేదలకు పంచలేక ప్రతిపక్షాలపై ఎదురుదాడి చేయడం సిగ్గు చేటని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతి నిధి దాసరి శ్యామ్ చంద్ర శేషు విమర్శించారు. జంగారెడ్డిగూడెంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పింఛన్ సొమ్ము పక్కదారి పట్టించడంతో 1న పింఛన్లు పంపిణీ చేయలేదన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం వలంటీర్లను విధులకు దూరంగా ఉండాలని ఆదేశిస్తే, వైసీపీ ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తూ ప్రజల్లో గందరగోళం సృష్టిస్తుందన్నారు. ఈనెల 3న సచివాల యాల్లో పింఛన్ పంపిణీలో కూటమి మూడు పార్టీల నేతలు పర్యవేక్షించి వృద్ధులు, దివ్యాంగులకు బాసటగా నిలవాలన్నారు, వైసీపీ కుట్రల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని శేషు పిలుపునిచ్చారు. పింఛన్ సొమ్ముతో పాటు జనవరి 23న బటన్ నొక్కిన ఆసరా, ఫిబ్రవరి 16న బటన్ నొక్కిన చేయూత, ఫిబ్రవరి 29న బటన్ నొక్కిన విద్యా దీవెన, మార్చి 14న బటన్ నొక్కిన ఈబీసీ నేస్తం, ఆరోగ్యశ్రీకి ఇవ్వాల్సిన నిధులు జగన్‌రెడ్డి తన అనుకూ ల కాంట్రాక్టర్లకు దోచిపెట్టాడని శేషు ఆరోపించారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఇంటి వద్దకే నెలకు రూ.4వేలు పింఛన్ అందిస్తుందన్నారు. విలేకరుల సమావేశంలో చెరుకూరి శ్రీధర్, చిట్టిబోయిన రామలింగేశ్వ రరావు, కౌన్సిలర్ నంబూరి రామచంద్రరాజు, తూటికుంట రాము, కంపా రాజేంద్ర, గుమ్మడి ప్రసాద్, తాళ్లూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందితో పంపిణీ చేయాలి : బొరగం

● బుట్టాయగూడెం: గ్రామ, వార్డు సచివాలయం సిబ్బందితో ఇంటింటికి పింఛన్లు పంపిణీ చేయాలని టీడీపీ పోలవరం నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ పింఛన్ సొమ్ము పక్కదారి పట్టడం వలనే 1న ఇంటింటికి పింఛన్లు పంపిణీ చేయలేదన్నారు. పింఛన్లు పంపిణీ చేయకపోవడానికి నిధులు పక్కదారి పట్టించడం కారణమన్నారు. 3న సచివాలయాల్లో పింఛన్ పంపిణి కూటమి పార్టీల నేతలు పర్యవేక్షించాలన్నారు.

పేదలపై ప్రభుత్వం కుట్ర : బీసీ నాయకులు

లింగపాలెం: పేదల పింఛన్లపై జగన్ ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తుందని టీడీపీ బీసీ విభాగం నాయకులు చెరువుగట్టు రామ్మోహన్ రావు, గజ్జావెంకటేశ్వరరావు విమర్శించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో ఎలక్షన్ కమిషన్ ప్రభుత్వ పథకాల పంపిణీకి వలంటీర్లను దూరంగా ఉంచాలని ఆదేశించిందన్నారు. జగన్ ప్రభుత్వం పింఛన్ నిధులు దారి మళ్లించి టీడీపీ పింఛన్లు ఆపుతుందని దుష్ప్రచారం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖజానాలో సొమ్ముతో తమ అనుచర కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తున్నాడని, డబ్బులు లేక పెన్షన్ల పంపిణీ ఆపి వేశారన్నారు. ప్రభుత్వం ఈనెల 1న పెన్షన్ అందిస్తామని చెప్పినా ఖజానాలో సొమ్ము లేకపోవడంతో 3న ఇస్తామని చెప్పిందన్నారు. వృద్ధులకు ఇచ్చే పింఛన్లపై తెలుగుదేశం పార్టీకి ఎలాంటి అభ్యంతరాలు లేవని తాము అధికారంలోకి వస్తే పెన్షన్లను రూ.4వేలకు పెంచి ఇంటివద్దకే పెన్షన్ వచ్చేలా చూస్తామని అన్నారు. వారితో పాటు పలువురు తెలుగుదేశం కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మిక నేత చలపతిరావు వర్ధంతి



చలపతిరావు చిత్రపటం వద్ద నివాళి

ఏలూరు రూరల్, ఏప్రిల్ 1: నగరపాలక సంస్థలో ఉద్యోగుల కార్మికుల సమస్యల పరిష్కారంలో కృషిచేసిన వల్లూరి వెంకట చలపతిరావుకు పలువురు నివాళులర్పించారు. స్థానిక కోటదిబ్బ విశ్రాంత ఉద్యోగుల కార్యాలయం వద్ద జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో చలపతిరావు వర్ధంతి సోమవారం జరిగింది. యూనియన్ అధ్యక్షుడు బల్ల నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ.అప్పలరాజు చలపతిరావు సేవలను గుర్తు చేశారు. చలపతిరావు చిత్రపటానికి బండి వెంకటేశ్వరరావు ట్యాప్ ఇన్‌స్పెక్టర్ హరినాథ్‌బాబు, ఎ.అప్పలరాజు పుష్పమాలలు వేసి నివాళులర్పించారు. యూనియన్ నాయకులు డి.వెంకటేశ్వరరావు, ఎస్.శ్రీనివాసు, ఎస్ఎంవి సుబ్బారావు, కె.వి రమణ, మధ్యాహ్నపు దుర్గారావు, అసిర్ అప్పడు తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్య మృతి పార్టీకి తీరనిలోటు

పెదవేగి, ఏప్రిల్ 1: ఈడ్పుగంటి నాగభూషణం (సుందరయ్య) మృతి పార్టీకి తీరనిలోటని మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. విజయరాయికి చెందిన ఈడ్పుగంటి సుందరయ్య(73) గుండెపోటుతో ఆదివారం రాత్రి మృతిచెందారు. పార్టీకి ఎన్నో సేవలు అందించిన సుందరయ్య విజయరాయి సొసైటీ చైర్మన్‌గా పనిచేశారు. ఆయన భౌతికకాయాన్ని చింతమనేనితోపాటు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, ఎన్డీఏ కూటమి ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌యాదవ్, పలువురు నాయకులు నివాళులర్పించారు. ప్రభాకర్ మాట్లాడుతూ సుందరయ్య పార్టీ అభివృద్ధికి చేసిన కృషి ఎనలేనిదన్నారు. ఆయన మృతి కుటుంబానికి ఎంత లోటు అంతకుమించిన లోటు పార్టీకి ఉందని ఆయన విచారం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చి, సానుభూతి తెలిపారు.

ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా నరేంద్రసింగ్

నూజివీడు టౌన్, ఏప్రిల్ 1: నూజివీడు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా ఆర్.నరేంద్రసింగ్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. డాక్టర్ మోహన్‌రావు స్వచ్ఛందంగా పదవీవిరమణ చేయడంతో ఉన్నతాధికారులు డాక్టర్ నరేంద్రసింగ్‌కు బాధ్యతలు అప్పగించారు.

గురుకుల విద్యాలయాలకు ఇద్దరు విద్యార్థుల ఎంపిక



దాసరి ఆకాష్ కుమార్
పరసా ఈశ్వర్ సాయి

పెదవేగి, ఏప్రిల్ 1: జవహర్ నవోదయ విద్యాలయం(జేఎన్వీ), ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశానికి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల్లో చదువుతున్న ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారని పెదవేగి ఎంఈవో సీహెచ్.బుధవాస్ తెలిపారు. మండలంలోని తాళ్ళగోకవరం మండల పరిషత్ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న దాసరి ఆకాష్‌కుమార్ గురుకుల విద్యాలయానికి ఎంపిక కాగా, కొప్పులవారిగూడెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న పరసా ఈశ్వర్ సాయి జేఎన్వీలో ఆరో తరగతిలో ప్రవేశానికి ఎంపికయ్యారని ఆయన చెప్పారు. జేఎన్వీ, గురుకుల విద్యాలయాల్లో ప్రవేశానికి ఎంపికైన విద్యార్థులను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

కాగుపాడు విద్యార్థి ఎంపిక



కంకిపాటి సుజీవ్ కుమార్

ఉంగుటూరు, ఏప్రిల్ 1: కాగుపాడు నెం 2 ప్రాథమిక పాఠశాల స్కూలు విద్యార్థి కంకిపాటి సుజీవ్ కుమార్ నవోదయకు ఎంపికయ్యారు. ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబరచడంతో సీటు పొందినట్లు పాఠశాల హెచ్ఎం ఓ.ఆనంద్ కుమార్ సోమవారం తెలిపారు. వెల్లమిల్లి గ్రామ విద్యార్థినులు ముమ్మిడి రవితేజ, నీలపాల నవ్యశ్రీలకు కూడా నవోదయ సీటు లభించిందని పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి : రూ.48 వేలు స్వాధీనం

పెదవేగి, ఏప్రిల్ 1: మండల కేంద్రం పెదవేగిలో పేకాట ఆడుతున్న సమాచారంతో పోలీసులు దాడిచేశారు. ముగ్గురిని అదుపులోకి తీసుకున్నాట్లు ఎస్ఐ వి.రాజేంద్రప్రసాద్ తెలిపారు. వారి నుంచి రూ.48,900 నగదును స్వాధీనం చేసుకున్నామని, కోర్టులో హాజరుపర్చుతామని ఆయన చెప్పారు.

కోళ్ల వ్యర్థాల వాహనం పట్టివేత

పెదపాడు, ఏప్రియల్ 1 : చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు సుమారు 10 టన్నుల కుళ్లిన కోడివ్యర్థాలను తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి ఐషర్ వాహనాన్ని అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై కె.శుభశేఖర్ సోమవారం కేసు నమోదు చేశారు.

జనసేన పార్టీలో చేరికలు



చేరిన వారిని స్వాగతించిన ధర్మరాజు

ఉంగుటూరు, ఏప్రిల్ 1: పవన్ కళ్యాణ్ ఆశయాల మేరకు పార్టీ శ్రేణులు ఆదర్శవంతమైన సేవలందించాలని నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి పత్సమట్ల ధర్మరాజు అన్నారు. గణపవరం మండలం పిప్పర గ్రామానికి చెందిన కొలనువాడ శ్రీనివాసరావు, ఆయన సోదరులు కృష్ణంరాజుతో పాటు వెంకట్రాజుపాలెం, కోమటిపాలెం, పిప్పర గ్రామాలకు చెందిన 270 మంది వైసీపీ నుంచి జనసేన పార్టీలో చేరారు. వారందరినీ సాదరంగా పార్టీలోకి ఆహ్వానించి జనసేన కండువా కప్పారు.కార్యక్రమంలో తోట శ్రీను ఇందుకూరి రామకృష్ణంరాజు,రంగరాజు జనసేన,టి.డి.పి.కార్యకర్తలు పాల్గొన్నారు.

● కొయ్యలగూడెం: మండలంలోని వివిధ పార్టీలకు చెందిన ముఖ్య నాయకులు జనసేన పార్టీలో చేరారు. మండలంలోని అచ్యుతాపురంలో కరాటం రాంబాబు, ఎమ్మెల్యే అభ్యర్థి చిర్రి బాలరాజు, మండల జనసేన అధ్యక్షుడు రవి సమక్షంలో సోమవారం పార్టీలో చేరారు. వైసీపీ నుంచి దుగ్గిన శ్రీను, కాంగ్రెస్ పార్టీ నుంచి నక్కా బాబీ, పారేపల్లి ప్రసాద్, చెన్నంశెట్టి సూర్యచంద్రం తదితర ముఖ్య నాయకులకు పార్టీ కండువాలు వేసి జనసేన పార్టీలోకి ఆహ్వానించారు. ఇక నుంచి వారంతా ఉమ్మడి నాయకులుగా జనసేన, టీడీపీ అభ్యర్థులను గెలిపిస్తారన్నారు.

తోట రామచంద్రపురంలో ట్యాంకర్‌తో నీటి సరఫరా

ఉంగుటూరు, ఏప్రిల్ 1: కాకర్లమూడి శివారు తోట రామచంద్రపురంలో సోమవారం తాగునీటి సరఫరాకు అటంకం కలిగింది. దీంతో స్థానికులు సమాచారం తెలపడంతో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి లక్ష్మీనారాయణ ఫౌండేషన్ చైర్మన్ పత్సమట్ల ధర్మరాజు మంచినీటి ట్యాంకర్ ఏర్పాటు చేశారు. తాత్కాలికంగా తాగునీటి సరఫరా చేశారు.

చెక్‌పోస్ట్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి : ఎస్పీ



లింగపాలెం మండలంలో వాహనాల తనిఖీ

ఏలూరు క్రైం, ఏప్రిల్ 1: రాష్ట్ర, జిల్లా సరిహద్దులో చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామని, సిబ్బంది అప్రమత్తంగా విధులను నిర్వర్తించాలని ఎస్పీ మేరీ ప్రశాంతి అన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గంజాయి, సారా, మద్యం, నగదు అక్రమ రవాణా జరుగకుండా జిల్లా వ్యాప్తంగా 8 చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. విధుల్లో ఉన్న పోలీసు అధికారులతో జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఎస్పీ మేరీ ప్రశాంతి సమావేశం నిర్వహించారు. చెక్‌పోస్టు ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. సరిహద్దు చెక్‌పోస్టులు, ముఖ్య కూడళ్ళ వద్ద సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులు వాహన తనిఖీ నిర్వహించి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని ఆదేశించారు. వాహన తనిఖీలలో ప్రజలు సహకరించేలా అవగాహన కల్పించాలన్నారు. వాహనదారులతో పోలీస్ సిబ్బంది మర్యాదపూర్వకంగా నడుచుకోవాలన్నారు. ఎవరైనా ఎన్నికల నియమావళిని అతిక్రమించినట్లు సమాచారం తెలిస్తే సి విజిల్ యాప్ ద్వారా లేదా టోల్ ఫ్రీనెంబర్ 112, సంబంధిత పోలీస్ స్టేషన్లకు సమాచారం అందించాలని సూచించారు. స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్లు మల్లేశ్వరరావు, ఆది ప్రసాద్ పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

లింగపాలెం: మండలంలో జె.శాంతి ఆధ్వర్యంలో ప్రధాన రహదారిపై వాహనాలను క్షుణంగా పరిశీలించారు. ఎవరైనా రూ.50వేలకు మించి నగదు తీసుకువెళ్ళవలసి వస్తే సరైన పత్రాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. మద్యం, ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే వస్తువులు తీసుకువెళితే వెంటనే సీజ్ చేసి కేసు నమోదు చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల సందర్భంగా అప్రమత్తంగా ఉండాలని, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలన్నారు. వాహనాల తనిఖీ సందర్భంగా వాహనదారులు ప్రతిఒక్కరూ సిబ్బందికి సహకరించాలని కోరారు. తనిఖీలలో హెడ్ కానిస్టేబుల్ కె.జయరాజు, కానిస్టేబుల్ డి.వి రాజు పాల్గొన్నారు.



చెట్లను నరికివేయడంతో మిగిలిన మోడులు

నేలకూలిన భారీ వృక్షాలు

కుక్కునూరు, ఏప్రిల్ 1: వృక్షో రక్షతి రక్షితః అని ప్రభుత్వం ఒక వైపు మొక్కలను నాటండి ప్రకృతిని కాపాడండి, పర్యావరణాన్ని పరిరక్షించండంటూ ప్రచారం చేస్తోంది. క్షేత్రస్థాయిలో కొందరు అత్యుత్సాహంతో భారీ చెట్లను నరికేస్తున్నారు. ఒక వసతి గృహం సంరక్షకుడు అత్యుత్సాహంతో భారీ చెట్లునేలకొరిగాయి. కుక్కునూరు మండల కేంద్రంలో సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం ప్రాంగణంలో పలు రకాల భారీ వృక్షాలు ఉన్నాయి. విద్యార్థులకు చల్లటినీడను ఇస్తూ వసతి గృహం ప్రాంగణం ఆహ్లాదకరంగా ఉండేది. వసతి గృహ వార్డెన్ ప్రాంగణంలో ఉన్న చెట్లను నరికి వేయించిన సంఘటన ఆలశ్యంగా వెలుగు చూసింది. రంపాలతో చెట్లను నరికివేయించడంతో వసతి గృహ ప్రాంగణం అంతా చెట్లు లేక మోడులు మాత్రమే కనబడుతున్నాయి. చెట్లు నరికివేయడానికి కారణాలు ఏమిటనేది తెలియక స్థానికులు ఆశ్చర్యపోతున్నారు. నరికిన చెట్లు ఎక్కడికి తరలించారని పలువురు ప్రశ్నిస్తున్నారు. దీంతో పలువురు వసతి గృహనిర్వాహకుడిపై జిల్లా స్థాయి అధికారులకు ఫిర్యాదు చేశారు.



మాట్లాడుతున్న ఆముదాలవలస కూటమి అభ్యర్థి రవికుమార్



తుమ్మగూడెంలో జయహో బీసీ సభలో మాట్లాడుతున్న పార్థసారథి



విశ్వబ్రాహ్మణ సంఘం ఆత్మీయ సమావేశంలో కామినేని



కలిదిండిలో మాట్లాడుతున్న టీడీపీ మండల అధ్యక్షుడు జోగిరాజు

ప్రజా సంక్షేమం మరచిన వైసీపీ

▸▸ తాగునీరు ఇవ్వలేని ప్రభుత్వం ▸▸ అప్పులు తెచ్చి ఆస్తులు కూడబెట్టుకున్నారు ▸▸ కైకలూరు నియోజకవర్గ కూటమి అభ్యర్థి కామినేని

మండవల్లి, ఏప్రిల్ 1: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమం విస్మరించిందని కైకలూరు నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి కామినేని శ్రీనివాస్ ధ్వజమెత్తారు. పుట్లచెరువు గ్రామంలో సోమవారం నిర్వహించిన కళింగ ఆత్మీయ సమావేశంలో కామినేనితో పాటు ఆముదాలవలస కూటమి అభ్యర్థి కూన రవికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కామినేని మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి అని భారీగా అప్పులు తెచ్చి ఆస్తులు కూడపెట్టుకుంటున్నారన్నారు. ప్రజలకు మంచినీరు అందించలేని అసమర్థ ప్రభుత్వమని విమర్శించారు. ఈ ఎన్నికల్లో జగన్ ప్రభుత్వాన్ని ఇంటికి పంపాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో అభివృద్ధి కుంటుపడిందని, నిన్నటి వరకు కేసులు పెట్టి బెదిరించారని కామినేని విమర్శించారు. ఇక నుంచి ఎవరు భయపడాల్సిన అవసరం లేదని, రేపటి తరం భవిష్యత్తు కోసం వైసీపీని ఇంటికి పంపాలని కామినేని కోరారు. కూటమిలో ఆముదాలవలస నుంచి కళింగ వర్గానికి చెందిన తనకు అవకాశం కల్పించినందుకు రుణపడి ఉంటానని కూన రవికుమార్ అన్నారు. కైకలూరు నియోజకవర్గంలోని కళింగ కులస్తులంతా కూటమికి మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు. టీడీపీ మండవల్లి మండల అధ్యక్షుడు నారగాని నాగేశ్వరరావు, కార్యదర్శి పళ్లెం ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి కృషి

కైకలూరు: విశ్వబ్రాహ్మణ సంక్షేమానికి తాను శక్తివంచన లేకుండా కృషి చేశానని కైకలూరు బీజేపీ అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. సోమవారం కైకలూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో కైకలూరు నియోజకవర్గ విశ్వబ్రాహ్మణ సంఘం ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో విశ్వబ్రాహ్మణుల పాత్ర ఎనలేనిదని ఐదేళ్లుగా వారిని వైసీపీ పట్టించుకోలేదని, చేతివృత్తుల వారికి పనిముట్లను అందించకుండా విస్మరించారన్నారు. తాను 2014 నుంచి 2019 వరకు కైకలూరులో విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి పాటుపడ్డానన్నారు. ఎవరైనా ఎప్పుడైనా నేరుగా తన వద్దకు వస్తే ఎలాంటి పనినైనా చేసిపెట్టేందుకు సిద్ధంగా ఉన్నట్టు, పేదల సంక్షేమమే కూటమి లక్ష్యమని అన్నారు. విశ్వబ్రాహ్మణ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు తుపాకుల సోమాచారి, సంఘ నాయకులు టేకు సత్యనారాయణ, అనుపోజు నాగేశ్వరరావు, టేకి కనకాచారి, ఆముదాలపల్లి బ్రహ్మం, కొల్లూరి కాళిదాసు, యానాల బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించాలి

కూటమి అభ్యర్థుల విజయానికి కార్యకర్తలు, నాయకులు నిరంతరం కృషి చేయాలని కైకలూరు మాజీ సర్పంచ్‌లు తెంటు నాగేశ్వరరావు, నర్సిపల్లి అప్పారావు కోరారు. సోమవారం కైకలూరు 1, 2వ వార్డులలో కైకలూరు అసెంబ్లీ బీజేపీ అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్, ఏలూరు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి పుట్టా మహేష్ కుమార్ యాదవ్ విజయాన్ని కోరుతూ ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. టీడీపీ అధికారంలోకి వస్తే ప్రజలకు జరిగే మేలు, రాష్ట్రాభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. సూపర్‌సిక్స్ పథకాలు పేదలపాలిట వరమని, ప్రజలంతా కమలం, సైకిల్ గుర్తులపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. జనసేన నాయకులు రామాంజనేయులు, టీడీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు కెకె బాబు, బీజేపీ కైకలూరు నియోజకవర్గ కన్వీనర్ వేంపాటి విష్ణురావు, టీడీపీ నాయకులు వేములపల్లి కారుణ్య, బలే ఏసురాజు, వీరాబత్తిన సుధా, జనసేన వీర మహిళలు పాల్గొన్నారు.



కైకలూరులో ప్రచారాన్ని నిర్వహిస్తున్న కూటమి నాయకులు



అల్లూరులో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

వ్యవస్థలను నిర్వీర్యం చేసిన జగన్

కలిదిండి: రాష్ట్రంలో అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసిన సీఎం జగన్‌ను సాగనంపాలని కైకలూరు నియోజకవర్గ కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సోమవారం కలిదిండిలో ఆత్మీయ సమావేశం నిర్వహించి మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఆక్వా పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోవటంతో చేపలు, రొయ్యలకు గిట్టుబాటు ధర లేక ఆక్వా రైతులకు పెట్టుబడులు రాక అప్పుల పాలవుతున్నారన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయకపోవటంతో సాగు, తాగునీటి సమస్య ఏర్పడిందన్నారు. నాసిరకం మద్యం విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారన్నారు. వంతెనలు శిథిలావస్థకు చేరి ప్రమాదభరితంగా ఉన్నప్పటికీ పట్టించుకోవటం లేదన్నారు. తన హయాంలో సాగునీటి సమస్య నివారణకు కొండంగి లాకుల వద్ద ఉప్పుటేరుపై రూ.13 కోట్లతో ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకాలతో వేలాది ఎకరాలకు సాగునీరు అందించానన్నారు. సైకో పాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాలన్నారు. తనను గెలిపిస్తే నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు జోగిరాజు, బీజేపీ నాయకులు డాక్టర్ సి.ఎల్.వెంకట్రావు, ఏఎంసీ మాజీ చైర్మన్లు వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, తాడినాడ బాబు, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు నున్న రమాదేవి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రొండి కృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఆత్మీయ సమావేశంలో వైసీపీ నాయకుడు కోకా తాతాజీతోపాటు పలువురు వైసీపీ నాయకులు కామినేని శ్రీనివాస్ సమక్షంలో చేరారు.

కూటమి విజయానికి విస్తృత ప్రచారం చేయాలి

గ్రామాల్లో కైకలూరు నియోజకవర్గ కూటమి అభ్యర్థి కామినేని శ్రీనివాస్ తరఫున టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కమిటీలుగా ఏర్పడి విస్తృత ప్రచారం నిర్వహించాలని టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, బీజేపీ మండల అధ్యక్షుడు నంబూరి బాండు రాజు, జనసేన రాజకీయ వ్యవహారాల రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బట్టు లీలా కనకదుర్గ అన్నారు. సోమవారం కలిదిండిలో జోగిరాజు అధ్యక్షతన కూటమి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో పది కమిటీలను నియమించి ఇంటింటికి వెళ్లి ఓట్లను అభ్యర్థించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా పార్టీల్లో నాయకులు కమిటీల్లో ఉండే విధంగా చూడాలన్నారు. ఏప్రిల్ 5వ తేదీ నుంచి ఎన్నికల ప్రచారానికి నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, తాడినాడ బాబు, అంగ్రాజు శ్రీనివాస్, దుగ్గిరాల పరమేశ్వరరావు, రెడ్డి చక్రవర్తి సారిక వెంకటేశ్వరరావు, చెన్నంశెట్టి మురళీకృష్ణ, త్రినాథ రాజు, బండి తులసీరావు, చిట్టూరి రవీంద్ర, భోగేశ్వరరావు, లంకా రత్నారావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కోరుకునే నాయకులకే పట్టం కట్టాలి..

ముదినేపల్లి: ఓటర్లు అభివృద్ధిని కోరుకునే నాయకులకు పట్టం పట్టాలని తెలుగు యువత కైకలూరు నియోజకవర్గ అధ్యక్షుడు దావు నాగరాజు కోరారు. ముదినేపల్లి మండలం అల్లూరులో సోమవారం పార్టీ నాయకులతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించి ఏలూరు ఎంపీ స్థానం నుంచి టీడీపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్‌ను, కైకలూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్‌ను గెలిపించాలని కోరారు. పార్టీ నాయకులు నీలిపల్లి సన్యాసిరావు, దాసరి శ్రీను, దావు శ్రీనివాసులు, పంతగాని నన్నీ, తోట రాజేంద్ర, కాసాని బాల యేసు తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు.

టీడీపీలో చేరికలు..

చాట్రాయి: ఆరుగొలనుపేటలో సోమవారం నూజివీడు కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి సమక్షంలో వైసీపీ దళిత నాయకుడు కొమ్ము ప్రసాద్ ఆధ్వర్యంలో పలువురు టీడీపీలో చేరారు. వారికి సారథి కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. సారథి మాట్లాడుతూ ప్రజల్లో వైసీపీపై తీవ్ర వ్యతిరేకత కన్పిస్తున్నదని చంద్రబాబు సీఎం కావటం తథ్యమన్నారు. ఆరుగొలనుపేటలో అనారోగ్యంతో బాధపడుతున్న బొలికొండ లక్ష్మీనారాయణ, పొట్టపల్లి రాజశేఖర్, మోదుగు వెంకటేశ్వరరావును పార్థసారథి పరామర్శించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు మందపాటి బసవారెడ్డి, ఇజ్జిగాని వెంకటేశ్వరరావు, పానుగళ్ళ కోటేశ్వరరావు, ఈడా శ్రీనివాసరావు, నోబుల్‌రెడ్డి, తల్లాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్ సామాజిక న్యాయానికి నాంది : కొలుసు

చాట్రాయి, ఏప్రిల్ 1: కూటమి ప్రభుత్వం ఏర్పడగానే అమలు చేయనున్న బీసీ డిక్లరేషన్ సామాజిక న్యాయానికి నాంది అని నూజివీడు నియోజకవర్గ కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి అన్నారు. మండలంలోని తుమ్మగూడెంలో సోమవారం రాత్రి జరిగిన జయహో బీసీ సదస్సులో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో బీసీలపై దాడులు పెరిగాయని, బీసీ డిక్లరేషన్‌లో భాగంగా అమలు చేయనున్న బీసీ రక్షణ చట్టం కొండంత భరోసా ఇస్తుందన్నారు. విద్యా ఉద్యోగ ఉపాధి రంగాలలో కూడా బీసీ యువతకు వైసీపీ ప్రభుత్వంలో అన్యాయం జరిగిందని, చంద్రబాబు సీఎం కాగానే ప్రభుత్వ ఉద్యోగాలు పెద్ద ఎత్తున భర్తీ చేయటంతో పాటు భారీ పరిశ్రమలు తెచ్చి యువతకు ఉపాధి కల్పిస్తారన్నారు. వైసీపీ బూటకపు వాగ్దానాలు నమ్మవద్దని, రాష్ట్రశ్రేయస్సు కోసం కూటమిని గెలిపించాలని అభ్యర్థించారు. ఇటీవల మృతి చెందిన టీడీపీ నాయకులు చీకటి చెన్నారావు, పసుపులేటి కోటేశ్వరరావు, వేముల రామారావుకు నివాళిగా సభ కొద్ది సేపు మౌనం పాటించింది. నియోజకవర్గ జనసేన నాయకుడు మరీదు శివరామకృష్ణ, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొట్టు వరలక్ష్మి, పలగాని దుర్గారావు, మండల బీసీ సెల్ అధ్యక్షుడు పానుగళ్ళ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పైప్‌లైన్‌ను పరిశీలిస్తున్న ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు తదితరులు

నూతన పైప్‌లైన్ ఏర్పాటుకు చర్యలు

ముసునూరు, ఏప్రిల్ 1: హామీ ఏమైంది ఎమ్మెల్యే గారూ.. శీర్షికన ఆంధ్రజ్యోతిలో సోమవారం రమణక్కపేట అరుంధతి కాలనీలో తాగునీటి సమస్యపై ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. సోమవారం ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, కార్యదర్శి ప్రసాద్, సర్పంచ్ భర్త రంగు గాంధీ రమణక్కపేట అరుంధతి కాలనీలో నీటి సరఫరా చేసే మంచినీటి ట్యాంకులు, సంబంధిత పైప్‌లైన్‌లను పరిశీలించారు. వాటర్ ట్యాంకుల్లో నీరు ఉన్నప్పటికీ కుళాయిల్లో సమృద్ధిగా నీరు రాకపోడంతో అక్కడక్కడ పైప్‌లైన్‌లను తనిఖీ చేశారు. పైప్‌లైన్ బ్లాక్ అవడం వల్లే ఒక వాటర్ ట్యాంక్ నుంచి నీరు రావడం లేదని గుర్తించారు. అలాగే మరో ట్యాంక్ నుంచి నీరు వదిలిన వెంటనే పల్లానికి నీరు వెళ్ళిపోయి మెరక ప్రాంతాల ఇళ్ళకు రావడం లేదని, ట్యాంక్ వద్ద వాల్వ్ అవసరమని గుర్తించారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు మాట్లాడుతూ 1996లో సుమారు ఐదడుగుల లోతులో వేసిన పైప్‌లైన్‌లో అక్కడక్కడ బ్లాక్ అవడం వల్ల కాలనీలో 40 వేల లీటర్ల మంచినీటి సరఫరా ట్యాంక్ ఉన్నా సమృద్ధిగా నీరు రావడం లేదన్నారు. ఆర్‌డబ్ల్యూయస్ అధికారుల సూచనల మేరకు పాత పైప్‌లైన్‌ను తొలగించి, సుమారు 110 మీటర్ల హెచ్‌డీపీఈ పైపులతో పైప్‌లైన్ వేసే పనులను ప్రారంభిస్తామన్నారు. పైప్‌లైన్ పనులు పూర్తయ్యే వరకు అరుంధతి కాలనీలో ట్యాంకర్లతో నీటి సరఫరా చేస్తామని వివరించారు.

కిల్లర్.. డాక్టర్ !

ఫిలిప్పైన్స్‌లో ఎంబీబీఎస్

ఆన్‌లైన్ బెట్టింగ్‌లో అప్పులపాలు

అప్పు ఇచ్చినవారికి మత్తు ఇంజక్షన్లు

ఒకరు మృతి.. ఇద్దరు ఆసుపత్రి పాలు

అరెస్టు చేసిన పోలీసులు



భానుసుందర్

ఏలూరు క్రైం, ఏప్రిల్ 1: ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగులకు అలవాటుపడి అప్పులు చేసి తీర్చే మార్గం కానరాక అప్పు ఇచ్చిన వారిని అనారోగ్యం పాలు చేయడానికి మత్తు ఇంజక్షన్లు చేసి ఆపై ఆసుపత్రిలో చేర్పించి అప్పు మాఫీ చేసుకునేందుకు పథకం పన్నిన ఒక జూనియర్ డాక్టర్‌ను ఏలూరు వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం రాత్రి ఏలూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వన్‌టౌన్ సీఐ రాజశేఖర్ వివరాలు తెలిపారు. ఏలూరు చొదిమెళ్ళకు చెందిన కొవ్వూరి భానుసుందర్ ఫిలిప్పైన్స్‌లో ఎంబీబీఎస్ చేస్తున్న వ్పుడు ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగులకు పాల్పడ్డాడు. పెద్ద మొత్తంలో అప్పులు చేసి బెట్టింగులు వేశాడు. గతేడాది మే నెలలో ఇండియాకు వచ్చిన తరువాత మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అర్హత పరీక్ష రాయాల్సి ఉంది. క్లినికల్ అసిస్టెంట్ వైద్యునిగా ఏలూరులోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేరాడు. ఏలూరు వన్‌టౌన్ లోని వేణుగోపాలస్వామి గుడి ప్రాంతానికి చెందిన వాకచర్ల హిమతేజ వద్ద మూడు లక్షలు అప్పు తీసుకున్నాడు. సొమ్మును హిమతేజ అడుగుతుండడంతో అతని వద్దకు వెళ్ళి తాను వైఎస్ఆర్ క్లినిక్‌లో పని చేస్తున్నానని రక్తనమూనాలు సేకరిస్తున్నానని, ఏదైనా అనారోగ్యం ఉంటే ప్రభుత్వమే పూర్తిగా ఉచితంగా వైద్య సేవలు అందిస్తుందని నమ్మబలికి మత్తు ఇంజక్షన్ ఎక్కించడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. అతడిని ఆస్పత్రిలో చేర్పించి బిల్లు కట్టాలని ఎదురు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. జరిగిన మోసంపై హిమతేజ ఏలూరు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ ఏడాది కేసు నమోదు చేశారు. అతని కోసం గాలిస్తుండగా పరారయ్యాడు. సత్రంపాడుకు చెందిన రాయల్ వెంకట్‌కు కూడా ఇలాగే ఇంజక్షన్ చేశాడు. అతను అనారోగ్యం పాలయ్యాడు. చొదిమెళ్ళ పోస్టుమాస్టర్ బత్తిన మల్లేశ్వరరావు అలియాస్ తంబి వద్ద 15 లక్షలు పైగా అప్పులు తీసుకున్నాడు. ఆయన ఇంటికి వెళ్ళి వైద్యం అందించేవాడు. చివరకు అతన్ని హతమారిస్తే 15 లక్షలు కట్టాల్సిన అవసరం లేదని గతేడాది డిసెంబరు 24న మల్లేశ్వరరావుకు మార్ఫిన్ ఇంజక్షన్ అధిక మోతాదులో ఇచ్చాడు. అతని ఇంట్లో ఉన్న బంగారం, లక్షన్నర నగదు అపహరించుకుపోయాడు. అప్పటి నుంచి పరారీలో ఉన్నాడు. జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు ఏలూరు డీఎస్పీ శ్రీనివాసులు పర్యవేక్షణలో ఏలూరు వన్‌టౌన్ సీఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో వన్‌టౌన్ ఎస్‌ఐలు లక్ష్మణబాబు, నవీన్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ అప్పన్న, కానిస్టేబుళ్ళు నిఘా ఏర్పాటు చేశారు. ఆదివారం అర్ధరాత్రి ఏలూరు మినీ బైపాస్ పడమర లాకుల వద్ద అనుమానాస్పదంగా ఉన్న కొవ్వూరి భానుసుందర్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో ఈ నేరాలు అన్నీ అంగీకరించడంతో అరెస్టు చేసి కోర్టుకు హాజరుపర్చగా రిమాండ్ విధించారు.

పంట కాల్వల్లో డెక్క తొలగించండి:ఆర్డీవో

కైకలూరు/మండవల్లి/ముదినేపల్లి, ఏప్రిల్ 1: వేసవిలో మంచినీటి ఎద్దడి నివారణకు మరికొద్ది రోజుల్లో కాలువలకు నీటి విడుదల చేస్తామని నీటి చౌర్యం జరగకుండా ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసి మంచినీటి చెరువులు నింపేలా మండల స్థాయి అధికారులు పనిచేయాలని ఏలూరు ఆర్డీవో ఎంఎస్‌కే ఖాజా వలీ ఆదేశించారు. సోమవారం నియోజకవర్గంలోని కైకలూరు, మండవల్లి, ముదినేపల్లి మండలాల్లోని పోల్‌రాజ్ కెనాల్, కైకలూరు పంట కాలువలను ఆయన పరిశీలించారు. ఇప్పటికే కాలువల్లో పేరుకుపోయిన తూడు, గుర్రపు డెక్కను రెండు, మూడు రోజుల్లో తొలగించాలని సూచించారు. ప్రకాశం బ్యారేజీ నుంచి త్వరలో కాలువలకు నీరు విడుదల చేస్తున్నారని, అన్ని పంటకాలువల్లో వ్యర్థాలను తొలగించాలన్నారు. కాలువలకు నీరు విడుదల చేసినా ఆక్వా సాగుకు, వ్యవసాయానికి ఒక్క చుక్క నీరు కూడా వెళ్లకుండా పూర్తిగా ఆ నీటిని మంచినీటి చెరువులకు మళ్లించాలని అందుకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. ఎవరైనా అక్రమంగా నీరు తరలిస్తే వారిపై చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, కార్యదర్శులు సమన్వయంతో పనిచేసి ముందుగానే మంచినీటి చెరువులకు మోటార్లను, ఆయిల్ ఇంజన్లను ఏర్పాటుచేసుకోవాలని సూచించారు. తహసీల్దార్లు ఎస్. పోతురాజు, ఎస్ఎల్ఎన్ కుమారి, ఇరిగేషన్ ఏఈ రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



అప్పాపురం వద్ద కైకలూరు పంటకాలువను పరిశీలిస్తున్న ఆర్డీవో




సమావేశంలో మాట్లాడుతున్న పి.రామకృష్ణ

పెండింగ్ ఉపాధి వేతనాలు చెల్లించాలి

నూజివీడు టౌన్, ఏప్రిల్ 1: పెండింగ్ ఉపాధి వేతనాలు విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం నూజివీడులో వ్యవసాయ కార్మిక సంఘం నూజివీడు నియోజకవర్గ బాధ్యుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలకు నాలుగు నెలల నుంచి వేతన బకాయిలు విడుదల చేయకపోవడంతో కూలీలు, పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పనిప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని, లేనిపక్షంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆందోళనకు సిద్ధమవుతామన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు ఎ. రవి, నాయకులు ఎం.హోలీమేరీ, కొమ్ము ఆనంద్, పి.లక్ష్మయ్య, స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

పోతురెడ్డిపల్లిలో చలివేంద్రం ప్రారంభం



నూజివీడు టౌన్, ఏప్రిల్ 1: వేసవిని దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ ద్రవాహారాన్ని అధిక మొత్తంలో తీసుకోవాలని నూజివీడు ఎంపీడీవో కిరణ్‌కుమార్ అన్నారు. నూజివీడు మండలం పోతురెడ్డిపల్లి గ్రామంలో చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడుతూ పంచాయతీలోని పలు కూడళ్ళల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని, పంచాయతీ కార్యదర్శికి సూచించారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆగిరిపల్లి బస్టాండ్‌లో చలివేంద్రం ఏర్పాటు



ఆగిరిపల్లి, ఏప్రిల్ 1: ఆగిరిపల్లి టీడీపీ నాయకుడు చవటపల్లి విక్టర్‌బాబు బస్టాండు సెంటర్‌లో కూలింగ్ వాటర్ మిషన్ ఏర్పాటు చేశారు. పంచాయతీ సర్పంచ్ చవటపల్లి లక్ష్మీ విక్టర్ ఆధ్వర్యంలో ఈ కూలింగ్ వాటర్ మిషన్ ఏర్పాటుచేసినట్లు ఆగిరిపల్లిలో ఉన్న అన్ని వాటర్ ప్లాంట్ల భాగస్వామ్యంతో ఇది ప్రారంభించామని తెలిపారు.

ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా నరేంద్రసింగ్

నూజివీడు టౌన్, ఏప్రిల్ 1: నూజివీడు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా ఆర్.నరేంద్రసింగ్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ బాధ్యతలు నిర్వర్తించిన డాక్టర్ మోహన్‌రావు స్వచ్ఛందంగా పదవీ విరమణ చేయడంతో ఆ బాధ్యతలను వైద్యఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు డాక్టర్ నరేంద్రసింగ్‌కు అప్పగించారు.

నవోదయకు ఇద్దరు విద్యార్థుల ఎంపిక

ముదినేపల్లి రూరల్, ఏప్రిల్ 1: వణుదుర్రు శివారు కొత్తపల్లి ప్రగతి పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు దోసనపూడి ప్రాసాత్విక, గుడివాడ నాగదుర్గ సత్యచైత్ర ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పార్థసారథి తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న జనసేన నాయకుడు కొల్లి వరప్రసాద్

బీవీ రావుపై అధిష్ఠానానికి ఫిర్యాదు చేస్తాం

కైకలూరు, ఏప్రిల్ 1: జనసేన నిబంధనలకు మారుపేరని అలాంటి పార్టీ ఆదేశాలను పాటించకుండా పార్టీ సమన్వయకర్త బీవీ రావు విమర్శలు చేయడంపై అధిష్ఠానానికి ఫిర్యాదు చేయనున్నట్టు ఆ పార్టీ కైకలూరు నాయకుడు కొల్లి వరప్రసాద్ అన్నారు. సోమవారం కైకలూరు జనసేన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ ఆత్మీయ సమావేశాల పేరుతో పార్టీ సమన్వయకర్త బీవీ రావు పార్టీని విమర్శించడం హేయమన్నారు. 2019 ఎన్నికల్లో బీసీ అభ్యర్థిగా గుర్తించి బీవీ రావుకు కైకలూరు అసెంబ్లీ టిక్కెట్టు కేటాయించారని ఆయన ఇపుడు బీసీలకు అన్యాయం జరిగిందని మాట్లాడడం హాస్యాస్పదమన్నారు. 2019 ఎన్నికల్లో ఓడిపోయినప్పటి నుంచి ఇటీవల కైకలూరు నియోజకవర్గంలో జరిగిన వారాహి యాత్ర వరకు పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనలేదని, వైసీపీ నాయకుల నుంచి ముడుపులు అందుకొని సొంత పార్టీపై బురద జల్లడం దుర్మార్గమన్నారు. కైకలూరు అసెంబ్లీ టిక్కెట్టును కూటమికి కేటాయించారని ఈ సమయంలో బీవీ రావు నామినేషన్ వేస్తాననడం విజ్ఞత కోల్పోవడమేనన్నారు. పార్టీ మండల అధ్యక్షులు ఉమారెడ్డి నాగమల్లేశ్వరరావు, వీరంకి వెంకయ్య, బోయిన రాజేష్, మహిళా నాయకులు తోట లక్ష్మి, శొంఠి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ ఎల్లలు తెలుసా..?

నూజివీడు, ఏప్రిల్ 1: నూజివీడు కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథికి నూజివీడు ఎల్లలు తెలుసా అని నూజివీడు ఎమ్మెల్యే మేకా ప్రతాప అప్పారావు ప్రశ్నించారు. నూజివీడులో అభివృద్ధి జరగలేదని విమర్శిస్తున్న సారథి పెనమలూరులో చేసిన అభివృద్ధి ఏమిటో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు.



మహిళలకు సత్కారం

మండవల్లి, ఏప్రిల్ 1: డ్వాక్రా మహిళలకు, బ్యాంకుకు సంధానకర్తలుగా వ్యవహరించి రుణాలు మంజూరుకు సహకరించిన బుక్ కీపర్లు, వెలుగు సిబ్బందికి ఇండియన్ బ్యాంక్ మండవల్లి శాఖ మేనేజర్ బొంతు దుర్గారావు మెమెంటోలు అందించి సోమవారం ఘనంగా సత్కరించారు. మండవల్లి బ్రాంచ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో దుర్గారావు మాట్లాడుతూ ఒక్కొక్క గ్రూపుకు గరిష్ఠంగా రూ.20లక్షలు రుణం మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. వెలుగు విభాగం ఏపీఎం గంట రాజశ్రీ, సీసీలను సత్కరించారు. బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.



పెన్షన్ ఇవ్వలేక టీడీపీపై ఆరోపణలా?

ముసునూరు, ఏప్రిల్ 1: ప్రభుత్వ ఖజానాలో నిధులు లేకపోవడం వల్లే సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు సోమవారం పెన్షన్ల పంపిణీ చేయలేదని టీడీపీ గ్రామ అధ్యక్షులు బర్మా శ్రీనివాసరావు, బీసీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మానురాజు సురేష్, తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గద్దె రఘుబాబు అన్నారు. సోమవారం అక్కిరెడ్డిగూడెంలో జరిగిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ ఖజానాను పూర్తిగా ఖాళీ చేసి, టీడీపీ, ఎన్నికల సంఘం వల్లే పెన్షన్ల పంపిణీ నిలిచిపోయిందని వైసీపీ నాయకులు అనడం విడ్డూరంగా ఉందన్నారు. ఒకటో తేదీన పింఛన్లు ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నా నేటికీ సీఎం జగన్ పింఛన్ల పంపిణీపై ఎటువంటి ఆదేశాలు జారీ చేయకపోవడంలో కుట్ర కోణం ఉందని, ప్రజలు గమనించాలని టీడీపీ నాయకులు కోరారు. ఒక్కో సచివాలయంలో 10 నుంచి 15 మంది సిబ్బంది ఉన్నారని, రెండు రోజుల్లో పెన్షన్లు పంపిణీ పూర్తిచేసే అవకాశం ఉన్నప్పటికీ, జగన్‌రెడ్డి స్వార్థ రాజకీయాల కోసం, తాను ఉంటే తప్ప మీకు పెన్షన్లు రావు అని ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నించడం దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఒకటో తేదీన రూ. 4 వేలు పెన్షన్ ఇంటికి తీసుకెళ్లి ఇచ్చేలా చంద్రబాబు ప్రణాళిక సిద్ధం చేశారని పేర్కొన్నారు. టీడీపీ నాయకులు కాటేపల్లి శ్రీనివాసరావు, పులిబిళ్ళ సత్యనారాయణ, తల్లిబోయిన సత్యనారాయణ, కాటేపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



చీకటి చెన్నారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

పేదల కోసం పాటుపడిన చెన్నారావు

చాట్రాయి, ఏప్రిల్ 1: పేదల శ్రేయస్సుకు, పార్టీ బలోపేతానికి నిరంతరం పాటుపడిన టీడీపీ నాయకుడు చీకటి చెన్నారావు ఆకస్మిక మృతి బాధాకరమని నూజివీడు కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి, చింతలపూడి మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ, ఏఎంసీ మాజీ చైర్మన్ కాపా శ్రీనివాసరావు, నియోజకవర్గ టీడీపీ నాయకుడు అట్లూరి రమేష్ నివాళులర్పించారు. చీపురుగూడెంలో సోమవారం చెన్నారావు దశదిన కర్మ సందర్భంగా ఏర్పాటు చేసిన సంతాప సభలో వారు మాట్లాడుతూ ఎక్కడ టీడీపీ సభలు, సమావేశాలు జరిగినా చెన్నారావు తప్పక హాజరయ్యేవారని, ఆయన మృతి పార్టీకి తీరనిలోటన్నారు. ప్రజలకు గాని, కార్యకర్తలకు గాని ఇబ్బంది వస్తే చెన్నారావు ముందు ఉండి వారికి సహకారం అందేలా కృషి చేసేవారని కొనియాడారు. చెన్నారావు ఆశయాలను ముందుకు తీసువెళ్ళి టీడీపీని తిరిగి అధికారంలోకి తేవడమే చెన్నారావుకు నిజమైన నివాళి అన్నారు. విజయ డెయిరీ డైరెక్టర్ బొట్టు రామచంద్రరావు, నాయకులు జగ్గవరపు ముత్తారెడ్డి, మోరంపూడి శ్రీనివాసరావు, పలగాని దుర్గారావు, మరిడి చిట్టిబాబు, బొట్టు లక్ష్మణరావు, వెల్డి నాగేశ్వరరావు, మందలపు జగదీష్, పాపోతు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కూటమి గెలిస్తేనే అభివృద్ధి : గోపాల్



ముదినేపల్లి, ఏప్రిల్ 1 : రానున్న పార్లమెంట్, శాసనసభ ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని దక్షిణ భారత కాపు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పండలనేని గోపాల్ కోరారు. సోమవారం ఆయన ముదినేపల్లిలో మీడియాతో మాట్లాడుతూ ఏపీలో కూటమి నేతృత్వంలో ప్రజాప్రభుత్వం ఏర్పడాల్సిన అవసరం ఉందన్నారు. గత అయిదేళ్లుగా అభివృద్ధికి నోచుకోని ఆంధ్రప్రదేశ్‌కు మంచి భవిష్యత్తును కల్పించగలిగే సత్తా కూటమికే ఉందన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు సమర్థత, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలకు తోడు కేంద్రం సహకారం కూడా పుష్కలంగా ఉంటుందని గోపాల్ అన్నారు. రైతులు ప్రధానంగా ఎదుర్కొంటున్న సాగునీటి సమస్య కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే పరిష్కారం అవుతుందన్నారు. నిరుద్యోగ సమస్య పరిష్కారానికి కూటమికి అత్యధిక ఎంపీ, ఎమ్మెల్యే సీట్లను ఇవ్వాల్సిన అవసరం ఉందని తెలిపారు.